RNI TELTEL/2024/89620

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

Gk MEDIA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 260, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 శుక్రవారం - 20 - డిసెంబర్ - 2024 , వెల రూ.5/-

## సహజీవనం తప్పు.. సమాజానికి వ్యతిరేకం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుంది



బ్రిటన్‌లో అతి పెద్ద సమస్య సహజీవనమే

ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్హులు

## క్యాన్సర్‌కు వ్యాక్సిన్



ఎంఆర్ఎన్ఏ టీకా అభివృద్ధి చేసిన రష్యా.. వచ్చే ఏడాది నుంచి ఉచితంగా ప్రజలకు!

క్యాన్సర్ వ్యాక్సిన్ల తయారీకి ముమ్మర పరిశోధనలు

## అమిత్ షా వ్యాఖ్యలపై తమిళ నటుడు విజయ్ విమర్శ..

కొంతమందికి అంబేద్కర్ పేరు అంటే గిట్టదంటూ ట్వీట్!



ఇటీవల అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దుమారం

అంబేద్కర్ పేరును పదే పదే చెప్పుకునే ఫ్యాషన్ ఇప్పుడు ఉందన్న అమిత్ షా

ఆయన వ్యాఖ్యలను తప్పుబడుతూ టీవీకే అధ్యక్షుడు విజయ్ ట్వీట్

## మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుంది



- కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయం
- క్వశ్చన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటి
- కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దు
- వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారింది




## కేటీఆర్ పై ఏసీబీ కేసు...

### ఈ-కార్ రేసింగ్ కేసులో

# ఏ1గా కేటీఆర్

అనుమతులు లేకుండా రూ. 55 కోట్లు చెల్లించినట్లు ఆరోపణ

కేసులో ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్

కేటీఆర్ కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే అవకాశం

## హైదరాబాదును విశ్వనగరంగా

# చేసింది కాంగ్రెస్

- ఓఆర్ఆర్ టెండర్లపై సిట్ విచారణకు సీఎం ఆదేశం
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి జైకా నుంచి నిధులు తెచ్చి ఓఆర్ఆర్ నిర్మించారు
- ఎయిర్పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి హైదరాబాదును విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్
- దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ ఆస్తులను గత ప్రభుత్వాధినేతలు అమ్మేసుకున్నారు



హైదరాబాద్: ఓఆర్ఆర్ టెండర్లపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సిట్ విచారణకు ఆదేశించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రవు కోరిక మేరకు విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి జైకా నుంచి నిధులు తెచ్చి ఓఆర్ఆర్ నిర్మించారు. దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పన్నంగా టెండరు అప్పగించిందని ధ్వజమెత్తారు. ఎయిర్పోర్టు, ఓఆర్ఆర్, మిగతా..2లో


## పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులకు

# రీడెండరింగ్ కు కేబినెట్ ఆమోదం

- 45 ఇంజనీరింగ్ పనులు 33,137 కోట్లతో పూర్తి చేయడానికి కేబినెట్ ఆమోదం
- జల్ జీవన్ మిషన్ పథకం అమలు జరగకపోవడం గత ప్రభుత్వం చేసిన నష్టానికి ఉదాహరణ
- 25 శాతం కంటే తక్కువ పనులు 11,400 కోట్లు.. వాటికి రీటెండరింగ్ జరుగుతుంది
- స్థిరమైన నీటి వనరులు వినియోగం ద్వారా త్రాగునీటి వసతి ఇవ్వాలన్నది జల్ జీవన్ మిషన్ ఉద్దేశం



అమరావతి: ముఖ్యమంత్రి నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్రపడింది.. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొలుసు పార్ధసారథి... కేబినెట్ నిర్ణయాలను వివరించారు.. జల్ జీవన్ మిషన్ పథకం అమలు జరగకపోవడం గత ప్రభుత్వం చేసిన నష్టానికి ఉదాహరణగా పేర్కొన్న ఆయన.. లక్ష నుంచి లక్షన్నరకి ప్రతిపాదనలు పంపించాయి కేరళ లాంటి చిన్న రాష్ట్రాలు సైతం మిగతా..2లో



## బీజేపీ ఎంపీలు నెట్టేస్తే.. మోకాళ్లకు గాయమైంది

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆవరణలో ఇవాళ బీజేపీ, ఇండియా కూటమి నేతల మధ్య తోపులాట జరిగింది. ఆ ఘటనలో బీజేపీ ఎంపీలు గాయపడ్డ విషయం తెలిసిందే. అయితే బీజేపీ ఎంపీలు నెట్టివేయడం వల్ల.. తాను కూడా కింద కూలినట్లు కాంగ్రెస్ ఎంపీ, రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. బీజేపీ ఎంపీలు మకర ద్వారం వద్ద తనపై భౌతిక దాడి చేసినట్లు ఆరోపించారు. ఆ సమయంలో తన మోకాళ్లకు గాయమైనట్లు పేర్కొన్నారు. ఆ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని ఆయన స్పీకర్‌ను కోరారు.

## చట్టాలు చెట్ల నరికివేతకు కాదు.. వాటిని కాపాడటానికే: సుప్రీంకోర్టు

అనధికారిక చెట్ల నరికివేత, ఢిల్లీ చెట్ల పరిరక్షణ చట్టం, ఇతర చట్టాల అమలుకు సంబంధించిన అంశాలపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ



న్యూఢిల్లీ : చట్టాలు ఉన్నది చెట్లను కాపాడటానికే కానీ, వాటిని నరికివేయడానికి కాదని సుప్రీంకోర్టు చెప్పింది. అనధికారిక చెట్ల నరికివేత, ఢిల్లీ చెట్ల పరిరక్షణ చట్టం, ఇతర చట్టాల అమలుకు సంబంధించిన అంశాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. పర్యావరణవేత్త ఎంసీ మెహతా 1985లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) నేపథ్యంలో ఈ విచారణ జరిగింది. చెట్ల సంఖ్యను లెక్కగట్టి, వాటిని పరిరక్షించేందుకు చేపట్టవలసిన చర్యలపై దృష్టి సారిస్తామని ధర్మాసనం తెలిపింది. విచక్షణ లేకుండా చెట్ల నరికివేతకు అనుమతులు ఇవ్వకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తామని చెప్పింది. దీనికోసం ఓ నిబంధనావళిని రూపొందిస్తామని తెలిపింది. తదుపరి విచారణ నేడు కొనసాగుతుంది.

## అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది




- అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ ఏపీ పీసీసీ చీఫ్
- అంబేద్కర్ ను అవమానించడం బీజేపీ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యలు
- దళిత, గిరిజన వర్గాల మనోభావాలను దెబ్బతీశారు

# పోరాటాలకు సమయం ఆసన్నమయింది...

## నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం

ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో జగన్ సమావేశం

చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్న జగన్

చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్య

చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానన్న జగన్

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపాటు



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ మరోసారి విరుచుకుపడ్డారు. ఆరు నెలలు కూడా తిరగకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని... ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వంపై రాలేదని ఆయన అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ నేతలతో ఈరోజు జగన్ బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంపై మనమంతా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమయిందని జగన్ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వైసీపీకి అనుకూలంగా మారాలంటే ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. ప్రజల తరపున మనం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం అని చెప్పారు. మన ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి మనం ఎంతో చేశామని జగన్ చెప్పారు. అంతకంటే ఎక్కువ చేస్తానని చెప్పి ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికీ చంద్రబాబు హామీలు ఇచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేశామని మిగతా..2లో

## ఈ నెల 28న చర్లపల్లి

# రైల్వే టెర్మినల్ ప్రారంభం



రూ.430 కోట్లలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణం

ప్రారంభించనున్న కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి

అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన రైల్వే టెర్మినల్

అమరావతి: పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సికింద్రాబాద్ కు సమీపంలోని చర్లపల్లి వద్ద నిర్మించిన భారీ రైల్వే టెర్మినల్ మరికొన్ని రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. చర్లపల్లి రైల్వే టెర్మినల్ డిసెంబరు 28న ప్రారంభోత్సవం జరుపుకోనుంది. ఈ రైల్వే టెర్మినల్ ను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ శైలిలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను మిగతా..2లో

## సహజీవనం తప్పు.. సమాజానికి వ్యతిరేకం

న్యూఢిల్లీ: సహజీవనం తప్పుడు విధానమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఇది సమాజ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. యూట్యూబ్ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో అతి పెద్ద సమస్య సహజీవనమే అని, పెళ్లిని వ్యతిరేకించడం పెద్ద సమస్యగా మారినట్లు ఇటీవల బ్రిటీష్ పార్లమెంట్ వెళ్లినప్పుడు అక్కడ తమకు తెలిసిందన్నారు. ఒకవేళ మీరు పెళ్లి చేసుకోకపోతే, అప్పుడు మీరెలా పిల్లల్ని కంటారని గడ్కరీ అడిగారు. ఒకవేళ పిల్లలు పుడితే, వాళ్ల భవిష్యత్తు ఏంటి ఆయన ప్రశ్నించారు. సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా వెళ్తే, అది ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించినట్లు తెలిపారు. సమాజం తనంతటే తాను నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ దేశంలో లింగ నిష్పత్తి సమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్హులని ఆయన అన్నారు. ఆదర్శ భారత దేశంలో విడాకుల్ని బ్యాన్ చేయాలన్న దాన్ని ఆయన ఖండించారు. సహజీవనం మంచిది కాదన్నారు. సేమ్ సెక్స్ మ్యారేజ్‌ను వ్యతిరేకిస్తూ గత ఏడాది సుప్రీంకోర్టుకు చెందిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

## అమిత్ షా వ్యాఖ్యలపై తమిళ నటుడు విజయ్ విమర్శ..

తమిళనాడు: ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై తమిళ సూపర్ స్టార్, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ విమర్శలు గుప్పించారు. కొంతమందికి అంబేద్కర్ పేరు అంటే అలెర్జీ అని విమర్శించారు. ఇంకా చెప్పాలంటే గిట్టదు అని అన్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లో విజయ్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ఓ పోస్టు చేశారు. అంబేద్కర్ భారత పౌరులందరికీ స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన సాటిలేని రాజకీయ మేధావి అని విజయ్ కొనియాడారు. అంబేద్కర్ వారసత్వం అట్టడుగు వర్గాలకు ఆశాజ్యోతి అని, సామాజిక అన్యాయానికి, వ్యతిరేక ప్రతిఘటనకు ప్రతీక అని విజయ్ పేర్కొన్నారు. ఆయన పట్ల తనకున్న ప్రగాఢ అభిమానాన్ని నొక్కి చెబుతూ, నిరంతరం అంబేద్కర్ నామాన్ని జపిస్తానని ఈ సందర్భంగా విజయ్ అన్నారు. "అంబేద్కర్.. అంబేద్కర్.. అంబేద్కర్.. మన హృదయాలలో, మన పెదవులపై ఆనందంతో ఆయన నామాన్ని జపించుదాం" అని టీవీకే అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఇక ఉత్తర తమిళనాడులోని విక్రవాండిలో తన పార్టీ మొదటి ర్యాలీ సందర్భంగా టీవీకే సైద్ధాంతిక గురువులలో అంబేద్కర్‌ను విజయ్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతం గణనీయమైన దళిత జనాభాను కలిగి ఉంది. అలాగే విదుతలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ థోల్ కంచు కోటగా పరిగణించబడుతుంది. తిరుమావళవన్ స్థాపించిన వీసీకేని గతంలో దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా అని పిలిచేవారు.కాగా, డిసెంబర్ 17న రాజ్యసభలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దేశవ్యాప్తంగా విపక్షాలు కూడా తీవ్రంగా ఖండించాయి. అంబేద్కర్ పేరును పదే పదే చెప్పుకునే ఫ్యాషన్ ఇప్పుడు ఉందని, ప్రతిపక్షాలు తరచూ దేవుడి పేరు జపిస్తే స్వర్గానికి చేరుకునేవారని ఆయన అన్నారు. దీంతో అమిత్ షా వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది

అమరావతి: దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు దైవంగా పూజించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను బీజేపీ అవమానించిందంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఆ పార్టీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. అంబేద్కర్ పై వ్యాఖ్యలతో దళితులు, గిరిజనుల మనోభావాలను అమిత్ షా దెబ్బతీశారని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ తో కలిసి బీజేపీ కుట్రలు పన్నుతోందని షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. మనుస్మృతిని విశ్వసిస్తుంది కాబట్టే బీజేపీ అనుక్షణం రాజ్యాంగంపై దాడికి పాల్పడుతోందని అన్నారు. బహిరంగ సభా వేదికలతో పాటు సాక్షాత్తూ పార్లమెంట్ లోనే అంబేద్కర్ ను అవమానిస్తున్నారని, హేళన చేస్తున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభలో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా, ఏఐసీసీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ లో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్ షర్మిల తెలిపారు.

## మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుంది

హైదరాబాద్: కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయమని, క్వశ్చన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. ఐదో రోజు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను గురించి సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. దీనిపట్ల హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం ఏంటని, ఒక మంత్రి మరో మంత్రిని ప్రశ్నించడం ఏంటన్నారు. కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని స్పీకర్‌ను కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారని, దన్నారు. అప్పుడు వారు సరిగ్గా చేసిఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. అయితే ఏ హోదాలో అడుగుతున్నారని హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ. నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే నన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందే, తాము ఏం చేశామో చర్చ పెట్టాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు.

## కేటీఆర్ పై ఏసీబీ కేసు... ఈ-కార్ రేసింగ్ కేసులో ఏ1గా కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ లో కేటీఆర్ పై కేసు నమోదయింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని చేర్చారు. విదేశీ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేకుండానే రూ. 55కోట్లు చెల్లించారనే ఆరోపణలతో కేసు నమోదయింది. కేటీఆర్ పై కేసు నమోదు చేయడానికి అనుమతించాలని గత నెల గవర్నర్ కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో, కేటీఆర్ పై కేసు నమోదు చేయడానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నాలుగు రోజుల క్రితం అనుమతిని ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కేసు నమోదు చేయాలంటూ మూడు రోజుల క్రితం ఏసీబీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లేఖ రాశారు. గవర్నర్ అనుమతిని కూడా లేఖకు జత చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసింది. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 13 (1) ఏ, 13 (2) పీసీ యాక్ట్, 409, 102 బీ సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. కేబినెట్ అనుమతి, ఫైనాన్స్ క్లియరెన్స్ లేకుండా నిధులు చెల్లించారని ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. కేటీఆర్ పై కేసు నమోదు కావడంతో, ఆయనను అరెస్ట్ చేస్తారని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. రెండు, మూడు రోజులలో కేటీఆర్ కు నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచే అవకాశం ఉంది.

## హైదరాబాదును విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్

మొదటి పేజి తరువాయి

ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి హైదరాబాదును విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్ అన్నారు. క్రెడిట్ అంతా కాంగ్రెస్కే దక్కుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజల అవసరాలు తీర్చాలని కృష్ణ, గోదావరి నీళ్లు తేవడానికి పీజేఆర్ ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్కు మెట్రో రైలు తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సే అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారడానికి కాంగ్రెస్ కారణమని వివరించారు. వేల కోట్ల ఓఆర్ఆర్ ఆస్తిని అప్పనంగా అమ్ముకున్నారని బీఆర్ఎస్పై రేవంత్రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలు ఓడించబోతున్నారని తెలిసి.. అమ్మేసుకున్నారని ఆరోపించారు. దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ ఆస్తులను గత ప్రభుత్వాధినేతలు అమ్మేసుకున్నారని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. హరీశ్రవు విచారణ కోరారు.. ఆయన కోరిక మేరకు సిట్ విచారణకు ఆదేశిస్తున్నట్లు రేవంత్రెడ్డి స్పష్టం చేశారు. విధివిధానాలు కేబినెట్లో చర్చించి విచారణ చేయిస్తామన్నారు. ఓఆర్ఆర్పై సీఎం రేవంత్రెడ్డి సిట్ విచారణకు ఆదేశించడంపై హరీశ్రావు స్పందించారు. ఓఆర్ఆర్ టెండర్పై తాను విచారణ కోరలేదన్నారు. అయినా కూడా విచారణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ముందు టెండర్ రద్దు చేసి విచారణకు ఆదేశించాలని కోరారు.


## పోరాటాలకు సమయం ఆసన్నమయింది...

మొదటి పేజి తరువాయి

వైసీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేశామని జగన్ చెప్పారు. మేనిఫెస్టోకు పవిత్రతను తీసుకొచ్చామని తెలిపారు. కరోనా వచ్చినా, ప్రభుత్వ ఆదాయం తగ్గినా, ఖర్చులు పెరిగినా సాకులు చూపకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేశామని చెప్పారు. తప్పుడు హామీలతో ప్రజలను చంద్రబాబు నమ్మించగలిగారని... జగన్ చేశారు కదా... చంద్రబాబు కూడా చేస్తారేమోనని ప్రజలు నమ్మారని... అందుకే మనం పరాజయం చెందామని అన్నారు. ఆరు నెలలు గడవకుండానే చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని చెప్పారు. చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానని... ఈరోజు దాన్ని చంద్రబాబు నిజం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నారని... ఇప్పుడు బిర్యానీ పోయింది, పలావు కూడా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు పథకాలు అందడం లేదని చెప్పారు. కరెంటు ఛార్జీల రూపంలో ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేశారని మండిపడ్డారు. స్కామ్ ల మీద స్కామ్ లు నడుస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని చెప్పారు.

# క్యాన్సర్‌కు వ్యాక్సిన్

### ఎంఆర్ఎన్ఏ టీకా అభివృద్ధి చేసిన రష్యా..



మాస్కో: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి త్వరలోనే వ్యాక్సిన్ అందుబాటులోకి రానున్నది. క్యాన్సర్‌కు టీకా అభివృద్ధి చేసినట్టు రష్యా బుధవారం చేసిన ప్రకటన క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మకంగా మారే అవకాశం ఉన్నది. తమ దేశంలోని పలు పరిశోధన సంస్థలు కలిసి క్యాన్సర్‌ను ఎదుర్కొనే ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను తయారుచేసినట్టు రష్యా న్యూస్ ఏజెన్సీ టీఏఎస్ఎస్ వెల్లడించింది. వచ్చే ఏడాది నుంచి క్యాన్సర్ బాధితులకు ఉచితంగా ఈ వ్యాక్సిన్ ఇవ్వనున్నట్టు రష్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పని చేసే రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ జనరల్ డైరెక్టర్ ఆంద్రే కాప్రిన్ తెలిపారు. క్యాన్సర్ కణాలను గుర్తించి, అంతం చేసేలా శరీర రోగ నిరోధక వ్యవస్థను ఈ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ సిద్ధం చేస్తుంది. క్యాన్సర్ కణతుల అభివృద్ధిని, రోగ సంబంధ కణాల వ్యాప్తిని అడ్డుకోవడంలో ఈ వ్యాక్సిన్ సమర్థంగా పని చేస్తున్నట్టు ప్రీ క్లినికల్ ట్రయల్స్‌లో తేలిందని గమలేయ నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ ఎపిడెమియాలజీ అండ్ మైక్రోబయాలజీ డైరెక్టర్ అలెగ్జాండర్ గింట్స్‌బర్గ్ వెల్లడించారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైతం తాము క్యాన్సర్ వ్యాక్సిన్ తయారీకి చాలా చేరువలో ఉన్నామని ప్రకటించిన సంగతి తెలిసిందే. వ్యాక్సిన్ పేరు ఏంటనేది మాత్రం ఇంకా వెల్లడించలేదు. రష్యాలో క్యాన్సర్ కేసులు భారీగా పెరుగుతుండటంతో కొన్నేండ్లుగా వ్యాక్సిన్ కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. 2022లో రష్యాలో 6,35,000 క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి.

క్యాన్సర్ వ్యాక్సిన్ల తయారీకి ముమ్మర పరిశోధనలు

క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో వ్యాక్సిన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. థెరప్యూటిక్ క్యాన్సర్ వ్యాక్సిన్లు క్యాన్సర్ కణాలపై ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు, యాంటీజెన్లను లక్ష్యంగా చేసుకొని, అంతం చేసేలా శరీర రోగ నిరోధక వ్యవస్థను సిద్ధం చేస్తాయి. ఇందుకోసం కొన్ని వ్యాక్సిన్లలో నిర్వీర్యం చేసిన లేదా మాడిపై చేసిన వైరస్‌లను ఉపయోగిస్తారు. ఇవేకాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వంటి క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నా యి. ఇవి సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటి ముప్పును తగ్గిస్తాయి. శరీరంలో సహజంగా ఉండే రోగ నిరోధక వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా క్యాన్సర్ కణతులు వేగంగా ఎదగకుండా, తిరగబడకుండా అడ్డుకోవడంలో, ప్రారంభ దశలో క్యాన్సర్‌ను తొలగించడంలో వ్యాక్సిన్లు కీలకంగా పని చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సొంతంగా క్యాన్సర్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేస్తున్నాయి. ఈ దిశగా అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు గ్లియోబ్లాస్టోమా అనే ఒక రకమైన బ్రెయిన్ క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. మే నెలలో పరీక్షలు జరపగా ఆశాజనకమైన ఫలితాలు వచ్చినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. యూకేలో సైతం మెలనోమా అనే చర్మ క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను తయారుచేసి పరీక్షించగా వ్యాధి బాధితులు కోలుకునే అవకాశాలు గణనీయంగా పెరిగినట్టు ప్రకటించారు.

## పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులకు రీడెండరింగ్ కు కేబినెట్ ఆమోదం

మొదటి పేజి తరువాయి




కేరళ లాంటి చిన్న రాష్ట్రాలు సైతం జలజీవన్ మిషన్ కి.. కానీ, పరిశుభ్రమైన నీటికి లక్షలాది ప్రజలు దూరమయ్యారని తెలిపారు.. అయితే, 25 శాతం కంటే తక్కువ పనులు 11,400 కోట్లు.. వాటికి రీటెండరింగ్ జరుగుతుంది.. వాటికి కేబినెట్ అనుమతి మంజూరు చేసిందన్నారు.. డోన్, ఉత్థానం, పులివెందులలో పనులు ప్రారంభించడానికి అనుమతులు ఇచ్చింది.. స్థిరమైన నీటి వనరులు వినియోగం ద్వారా త్రాగునీటి వసతి ఇవ్వాలన్నది జల్ జీవన్ మిషన్ ఉద్దేశం అన్నారు.. ఇక, ఇప్పటి వరకూ డోలాయమానంలో ఉన్న అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నిధులు ఇచ్చాయి.. 45 ఇంజనీరింగ్ పనులు 33,137 కోట్లతో పూర్తి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. మంత్రి పార్థసారథి.. గ్రామకంఠ భూముల సర్వే, రికార్డింగ్ లో 48,899 సబ్ డివిజన్ చేయడానికి అర్జీలు వచ్చాయి.. వాటికి ఫీజు రాయితీ ఇస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నా యన.. వరదల్లో ముంపుకు గురైనవారి రుణాలపై యూజర్ ఛార్జీలు ఎత్తివేయడానికి, రుణాలు రీషెడ్యూల్ చేయడానికి మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.. మార్క్ ఫెడ్ కు 1000 కోట్ల అదనపు రుణాన్ని పొందేందుకు ఆమోదం లభించింది.. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులకు రీడెండరింగ్ కు కేబినెట్ ఆమోదించింది.. హంద్రీనీవా కింద పుంగనూరు బ్రాంచి కెనాల్ కు పాత రేట్ల ప్రకారమే చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ తో ఎన్టిపిసి జాయింట్ వెంచర్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది.. 1.06 లక్షల ఉపాధి అవకాశాలు ఈ జాయింట్ వెంచర్ ద్వారా వస్తాయన్నారు.. మరోవైపు.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించనున్నాం.. 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, కేజీబీవీల్లో ఈ పథకం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మంత్రి పార్థసారథి.. ఈ పథకాన్ని పునరుద్ధరించడం వల్ల 1.4 లక్షల మంది విద్యార్థులు ఉపయోగపడుతుందన్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లకు పుస్తకాల సరఫరాకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.. ప్రభుత్వ కాలేజీలలో సైతం జేఈఈ వంటి పరీక్షలకు కావాల్సి ఏర్పాటు చేస్తాం అన్నారు మంత్రి కొలుసు పార్థసారథి...

మొదటి పేజి తరువాయి

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను రూ.430 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించారు. ఇందులో 9 ప్లాట్ ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రిజర్వేషన్ కౌంటర్లు, రెగ్యులర్ టికెట్ కౌంటర్లు ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, ఏసీ, నాన్-ఏసీ వెయిటింగ్ లాంజ్ లు కూడా ఉన్నాయి. ప్రయాణికులు ఈ స్టేషన్ లో ఉచితంగా వై-ఫై పొందవచ్చు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి 25 రైళ్లు (25 అప్, 25 డౌన్) రాకపోకలు సాగించనున్నాయి. ప్రధానంగా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పై ఒత్తిడి తగ్గించాలన్న ఉద్దేశంతోనే చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మించారు. ఇక్కడ్నించి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని అంచనా.

## డిసెంబర్ 21 నుంచి 25 వరకూ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ.. ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ఆలయ అధికారులు




విజయవాడ : విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణ కార్యక్రమం జరగనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి లక్షలాదిగా అమ్మవారికి ఇరుముళ్లు సమర్పించడానికి తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఆలయ పరిధిలోని పూర్తి సమాచారం తెలిసేలా భవానీ దీక్ష 2024 పేరుతో ప్రత్యేక యాప్‌ను ఆలయ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యాప్ గురించి ఆలయ ఈవో రామారావు మీడియాకు వెల్లడించారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ యాప్‌లో 24 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఈవో చెప్పారు. భవానీ దీక్ష విరమణ సవ్యంగా, సంతోషంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు.

## సీఎం రేవంత్‌కు దమ్ముంటే ఫార్ములా -ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టాలి : కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఫార్ములా - ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. కానీ రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చకు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెడితే ఎవరు ఏంటో ప్రజలే నిర్ణయించుకుంటారు. రేవంత్ రెడ్డి లీకులిచ్చి రాజకీయ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. ఫార్ములా ఈ రేస్, ఇతర స్కాములంటూ అసత్యాలను ప్రచారం చేసే కన్నా సభలో చర్చ పెడితే నిజాలు తెలుస్తాయి కదా..? చర్చ నాలుగు గోడల మధ్య కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టమని డిమాండ్ చేస్తున్నాం. లీకు వీరుడు సీఎం ఇచ్చే లీకులే తప్ప నిజాలు అధికారికంగా చెప్పే దమ్ములేదు అని కేటీఆర్ అన్నారు. ఈ ఫార్ములా రేస్‌లో విషయమే లేనప్పుడు ముందే నేను కోర్టులకు వెళ్లి ముందస్తు బెయిల్ అడగాల్సిన అవసరం లేదు. న్యాయంగా వ్యవహరించే, ప్రభుత్వ ఆరోపణలు పరిశీలిస్తే ఏ జడ్జి అయినా వేంటనే కేసు కొట్టేస్తారనే నమక్కముంది. అధికారికంగా చెప్పే దమ్ములేక కేబినెట్‌లో నాలుగు గంటల చర్చ అంటూ వార్తలు రాపిస్తున్నారు. కేబినెట్ అంటే గాసిప్ బ్యాచ్ లెక్క తయారైంది. నిజాలు చెప్పే దమ్ము లేఖ సీఎస్‌తో నోటీసులు, అనుమతులు అంటూ లీకులిస్తున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మధుమేహం పనిపట్టే కొత్త ఔషధం.. షుగర్‌తోపాటు కొవ్వునూ తగ్గిస్తుంది!




టోక్యో, : మధుమేహాన్ని నియంత్రించే కొత్త ఔషధాన్ని జపాన్‌లోని కుమమొటొ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. హెచ్‌పీహెచ్-15 అనే ఈ ఔషధం ఒంట్లో చక్కెర స్థాయిలను అదుపు చేయడంతో పాటు పేరుకుపోయిన కొవ్వును తగ్గించడానికి సైతం సమర్థంగా పని చేస్తున్నదని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న మెట్ఫార్మిన్ కంటే ఇది మెరుగ్గా పని చేస్తున్నట్టు చెప్పారు. ప్రొఫెసర్ ఐచి అరకి, అసోసియేట్ ప్రొఫెసర్ హిరోషి తతీషి నేతృత్వంలోని పరిశోధకుల బృందం హెచ్‌పీహెచ్-15ను అభివృద్ధి చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'డయాబెటొలోజియా' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కాలేయం, కండరాలు, కొవ్వు కణాలు గ్లూకోజ్‌ను శోషించుకోవడాన్ని మెరుగుపర్చడం ద్వారా ఇది షుగర్ లెవల్స్‌ను అదుపు చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్కువ డోసుతోనే ఇది మెట్ఫార్మిన్ కంటే మెరుగ్గా పని చేస్తున్నట్టు తేల్చారు.

కొవ్వును కరిగించడానికీ ఉపయోగం

చర్మం కింద పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలోనూ, ఫ్యాటీ లివర్‌ను నయం చేయడంలోనూ హెచ్‌పీహెచ్-15 సమర్థంగా పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఇందులో యాంటీఫైబ్రాటిక్ గుణాలు కూడా ఉన్నాయని, మధుమేహ బాధితుల్లో సాధారణంగా కనిపించే లివర్ ఫైబ్రోసిస్‌ను తగ్గించడానికీ ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. మెట్ఫార్మిన్ తీసుకునే వారిలో లాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి ఎక్కువవడం సమస్యగా ఉంటుందని, హెచ్‌పీహెచ్-15తో ఈ సమస్య చాలా తక్కువ అని తెలిపారు. మధుమేహంతో పాటు ఊబకాయం ఉన్న వారి చికిత్సకు ఈ ఔషధం మెరుగ్గా పని చేస్తుందని చెప్పారు.

## స్టేట్ బ్యాంక్ ఎండీగా తెలుగుతేజం నియామకం



ఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గా అమర రాంమోహన్ రావును కేంద్రం నియమించింది. ఎస్బీఐలో ఎండీగా కొనసాగిన సీఎస్ శెట్టి గత ఆగస్టులో చైర్మన్ గా బాధ్యతలు చేపట్టడంతో ఆ స్థానంలో రాంమోహన్రావు అమరను ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) సిఫారసు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని నియామకాల మంత్రివర్గ కమిటీ ఆమోదించింది. సీఎస్ శెట్టి స్థానంలో రాంమోహన్రావును ఎండీగా నియమించాలని సెప్టెంబర్ ఎఫ్ఎస్ఎస్ఐబీ సిఫారసు చేసింది. ప్రస్తుతం రాంమోహన్ రావు ఎస్బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలతోపాటు చీఫ్ రిస్క్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. అమర రాంమోహన్ రావు స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల 1991లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అమర రాంమోహన్రావు ప్రొబేషనరీ ఆఫీసర్ చేరారు. ఎస్బీఐలో ఫీల్డ్, క్రెడిట్, రిస్క్, రిటైల్ తదితర విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. అంతేగాక అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థపై అపార అనుభవం సంపాదించారు.

## రాహుల్పై ఆరోపణలు.. అమిత్ షాను కాపాడేయత్నం:




దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్షా ను కాపాడుకునేందుకే తన సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ పై ఆరోపణలు చేస్తున్నారంటూ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ గాంధీ తోయడం వల్లే తమ ఇద్దరు ఎంపీలు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రియాంక స్పందించారు. "డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను పట్టుకొని, జై భీమ్ అని నినాదాలు చేస్తూ శాంతియుతంగా పార్లమెంట్లోకి ప్రవేశిస్తున్నారు. లోపలికి వెళ్లకుండా ఆయన్ను ఎవరు ఆపారో మీరు చూడొచ్చు. మేం చాలారోజులుగా నిరసనలు చేస్తున్నాం. ఈ రోజు వారు ఆందోళనకు దిగారు. అప్పుడే ఈ తోపులాటలు, గుండాగిరీ చోటుచేసుకుంది. అన్ని అమిత్ షాజీని కాపాడుకునేందుకు ఈ యత్నాలు మొదలుపెట్టారు. రాహుల్ ఎవరినో తోశారంటూ ఆరోపణలు చేస్తున్నారు. నా కళ్లముందు ఖర్గేజీని తోశారు. ఆయన నేలపై పడిపోయారు. తర్వాత సీపీఎం ఎంపీని నెడితే.. ఆయన ఖర్గేజీపై పడిపోయారు. ఇదంతా ఒక కుట్ర. వారి నిజమైన సెంటిమెంట్ ఈ రోజు బయటపడింది. 'జై భీమ్' అని నినాదాలు చేయాలంటూ వారికి నేను సవాలు విసురుతున్నాను" అని ప్రియాంక మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేద్కర్ ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం ఎంపీలు కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. రాహుల్ తోయడం వల్లే వారు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తోంది.

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కార్యదర్శిగా
# కాశి గారి యాదగిరి నియామకం



రాజేంద్రనగర్ ప్రతినిధి (నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శిగా మైలార్ దేవ్ పల్లి ప్రాంతానికి చెందిన కాశి గారి యాదగిరి నియమితులయ్యారు. పద్మశాలి కులస్తుల కోసం తాను గత కొంతకాలంగా చేస్తున్న పోరాటాలను గుర్తించి పద్మశాలి అదృష్టం ఆయనకు రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర నాయకుల సమక్షంలో కాశి గారి యాదగిరి రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణస్వీకారం నిర్వహించారు. పద్మశాలి చేస్తున్న కృషికి నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు వల్లకటి రాజ్ కుమార్ కాశీ గారి యాదగిరి సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. సందర్భంగా కాశి గారి యాదగిరి మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు తనపై మరింత బాధ్యత పెరిగింది అన్నారు. తన పదవికి న్యాయం చేస్తూ పద్మశాలీల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కాశి గారి యాదగిరి పేర్కొన్నారు.

## అంబేద్కర్ ను అవమానించిన బిజెపి పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 ఆమనగల్లు:ఆమనగల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డా,,అంబేద్కర్ ను అవమానించినందుకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నిరసన తెలపటం జరిగింది. మండల అధ్యక్షుడు తెల్లమళ్ళ జగన్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన బిజెపి కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలనే మీరు ఈరోజు కేంద్రమంత్రిగా చలామణి అవుతున్నారు. అంబేద్కర్ గొప్ప మేధావి.రాబోయే ముందు తరాలకు ఆయన రాసిన భారత రాజ్యాంగం దార్శనికత కు గొప్ప నిదర్శనం.అంబేద్కర్ ను అవమానించడం అంటే సమస్త భారత జాతిని కించపరచినట్లే అవుతుందన్నారు.వెంటనే క్షమాపణలు చెప్పాలని లేనిచో సమస్య తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య,మాజీ ఎంపీపీ అనిత- విజయ్,పట్టణ మైనారిటీ అధ్యక్షులు ఖాదర్,కరీం,జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు ఫరీద్,వాటర్ బాబా,జకురం,సోషల్ మీడియా ఇన్చార్జి దేవరశెట్టి మహేష్,శ్రీను,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


## కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
### కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్, కృష్ణ యాదవ్



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 ఆమనగల్లు:ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో బూత్ కమిటీ ల ఇన్చార్జీలు, కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్ మరియు దుడ్డు కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో 196 బూత్ కమిటీ అధ్యక్షుడిగా దుడ్డు పాపయ్య,యూత్ అధ్యక్షుడిగాకడారి వీరేష్ లను ఎన్నుకున్నారు.పార్టీపటిష్టతకు ఎల్లప్పుడూ కృషిచేయాలని సూచించారు. అనంతరం వారికి నియామక పత్రం అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి పార్టీ అమలు చేస్తున్న అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ స్థానాలు బిజెపి గెలుచుకునేలా బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో దుడ్డు యాదయ్య,కుమ్మరి పాండయ్య,దుడ్డు నారాయణ,ఉప్పుల అల్లాజీ,సత్తు బజార్,కడారి బజార్,కుమ్మరి భాస్కర్,కవాలి రమేష్,జంతుక అల్లయ,జంతుక రమేష్,మది చందు, కటిక అల్లయ్య,పల్లె నరసింహ, మల్లేష్,పర్వతాలు,హరిదాసు,శ్రీశైలం, అల్లాజి,మహేందర్,కృష్ణ,రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి భావం మానవాళి పురోగమనానికి తోడ్పడుతుంది
### డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 కడ్తాల్:అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన రావిచెడు గ్రామం.భక్తి భావం మానవాళి పురోగమనానికి,శాంతి స్థాపనకు దోహదపడుతుందని ప్రజలు భక్తి,దైవ మార్గంలో



ముందుకు సాగాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు,కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డిలు అన్నారు.గురువారం రావిచెడు గ్రామంలో అయ్యప్ప స్వాములు నిర్వహించిన ఇరుముడి మహా పడిపూజ లో ఆయన గంప వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వెంకటేష్ (గురు స్వామి) ముకుంద (గురు స్వాములు) ప్రత్యేక ఇరుముడి పూజలు నిర్వహించారు.ఇరుముడి కట్టుకొని శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములను గంప వెంకటేష్ గుప్తా సన్మానించారు.సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.భక్తి మార్గం సమాజశాంతికి దోహదపడుతుందన్నారు.అయ్యప్ప మాల ధరించిన స్వాములు 41వ రోజుల పాటు నిష్ఠతో భక్తిశ్రద్ధలతో అయ్యప్పను పూజించుకోవడం జరుగుతుందని అన్నారు.గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి అయ్యప్ప స్వాములకు భిక్షను(అన్నదానం) ఏర్పాటు చేశారు.ఈ ఇరుముడి మహా పడి పూజలో రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్,కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి,మాజీ ఎంపీటీసీ గోపాల్,గ్రామ బీఆర్ఎస్ ఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్,మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్,రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య,మాజీ వార్డు సభ్యులు పవన్,మల్లేష్,రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు బాలకృష్ణ,శ్రీశైలం,నరేందర్ రెడ్డి,బొప్పిడి శివ,జాంగిర్ అలీ,హన్మా నాయక్,అశోక్, సోషల్ మీడియా కన్వీనర్ సాయికుమార్, రాములు,రాజు,రవి,రమేష్,జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గా అక్కం సత్యనారాయణ



దమ్మపేట ప్రతి నిధి దొడ్డా వినోద్ **(నేటి శుభోదయ):** స్థానిక మండల కేంద్రం లో గల అక్కం సత్తిబాబు కాంప్లెక్స్ నందు దమ్మపేట ప్రెస్ క్లబ్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా క్లబ్ నూతన కార్యవర్గాని ఎన్నుకున్నారు సమన్వయ కమిటీ సభ్యులు గా అడపా లచ్చయ్య దొర,రావు శ్రీధర్,పిట్టల రాంబాబు.గౌరవ అధ్యక్షులు గా చామర్తి సాయి ప్రసాద్ శాస్త్రి.చైర్మన్ గా అక్కం సత్యనారాయణ,వైస్ చైర్మన్ కౌవులూరి వినోద్ కుమార్ ,ప్రధాన కార్యదర్శిగా తోట మల్లేశ్వరరావు,కోశాధికారి గా రొయ్యల బాబురావు,సహాయ కార్యదర్శి గా గట్ల శ్రీనివాసరావు,ప్రచార కార్యదర్శి గా పానుగంటి లక్ష్మణ్ గౌడ్,కార్యనిర్వహక సభ్యులు గా రావూరి రవిశంకర్, తాలూరి ప్రవీణ్, పునుగుపాటి వెంకటేశ్వరరావు,గాజుబోయిన శ్రీనివాసరావు,దొడ్డా వినోద్ కుమార్ ల ను ఎన్నుకున్నరు

# కేంద్ర హెూం శాఖ మంత్రి , అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం **(నేటి శుభోదయ):** ఏఐసిసి ఆదేశాల మేరకు ఏఐసిసి ,ఎస్సీ విభాగం,టిపిసిసి మరియు టిపిసిసి ఎస్సీ విభాగం పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి హెూం శాఖ మంత్రి, అమిత్ షా దిష్టిబొమ్మ తో ప్రదర్శనగా వెళ్లి పాత బస్టాండ్ సెంటర్ నందు రాస్తారోకో నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మరియు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య







జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ.భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పై రాజ్యసభలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను.. వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి హెూం శాఖ మంత్రి అమిత్ షా ను భర్తర్ఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం దేశ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డా,,బి.ఆర్.అంబేద్కర్ అంటే గౌరవం లేదు విలువలేదు రాజ్యసభలో అంబేద్కర్ను చిన్నచూపు చూడడం సిగ్గుచేటు రాజ్యాంగంపై ప్రమాణం చేసే కేంద్ర మంత్రిగా ఈనాడు మీరు చలామణి అవుతున్నారు అది మరిచి ఒక దళిత వర్గానికి చెందిన మేధావిని అవమానకరంగా రాజ్యసభలో మాట్లాడటం అనేది తగదని వెంటనే భారత ప్రజలకు క్షమాపణ చెప్పి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని మా ప్రధాన డిమాండ్ గా మేము కోరుతున్నాం...రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారిని అవమాన పరుస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేశారంటే మీ పార్టీకి మీకు మీ మంత్రి వర్గానికి దళితులు అంటే ఎంత చిన్నచూపో అర్థం అవుతుంది కానీ ఈనాడు అంబేద్కర్ అంటే ఒక దళిత వర్గానికి చెందిన వ్యక్తి కాదు యావత్ భారత దేశ ప్రజల ఆకాంక్ష ఆరాధ్య దైవం అని మీరు గుర్తు చేసుకోవాలి... ఈనాడు భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారిని దేవుడు లాగా అందరూ ఆరాధిస్తారు, మన భారతదేశ సంస్కృతి ఆంధ్రప్రదేశ్లో గోదావరిపై ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ గారి విగ్రహాన్ని నిర్మించి ఇప్పటికి అతనిని దేవుడులాగా ఆరాధిస్తున్నారు. ఇది మన భారతదేశ సంస్కృతి అది మీరు మరిచి మోడీ జపం చేస్తూ పరిపాలనను పక్కకు పెట్టి కాలయాపన చేస్తున్నారు... ఇండియా కూటమి సభ్యులు సభలో అంబేద్కర్ గారి గురించి మాట్లాడితే అది తప్పుగా భావించి ప్రతిపక్షాలను నీరుగార్చే విధంగా అవమానపరచటం సభను తప్పుదోవ పట్టించడం కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేసి దేశ ప్రజలను అవమానిస్తున్నారు....11 ఏళ్ల మీ పరిపాలనలో దేశానికి ఏ ఒక్క మంచి పని చేయకపోగా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం రాజ్యాంగాన్ని రూపుమాపటం కోసం మీరు పడుతున్న తపన దాన్ని ఖండిస్తున్న ప్రతిపక్ష నాయకులపై మీ అక్కసు బయటపడుతుంది సభ సజావుగా జరిగితే మీరు తీసుకొచ్చే తప్పుడు బిల్లులన్నీ పాస్ చేసుకోవడం కోసం సభను తప్పుదోవ పట్టించే విధంగా దేవుడైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని రాజ్యసభల అవమానపరచడం ఇది దేశానికే చీకటి రోజుగా భావిస్తున్నాను....ఈ కార్యక్రమంలో వీరితో పాటు టిపిసిసి సభ్యులు, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా జిల్లా మహిళా,మైనారిటీ,సేవాదళ్ అధ్యక్షులు దొబ్బల సౌజన్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,సయ్యద్ గౌస్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, మద్దినేని రమేష్, జిల్లా ఐయన్టీయిసీ,ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, చంద్రిక,కాళంగి కనకరాజు, షేక్ వాసిం భాయ్, చంద్రగిరి నగేష్, నారపోగు సుదర్శన్, భూక్యా సురేష్ నాయక్,పాషా, రాకేష్,కందుల శ్రీనివాస్, కొలిపొంగు రమేష్,చింతపల్లి రామయ్య, అన్వేష్ గౌడ్, యాసబోయిన శ్రీశైలం, బెజ్జం గంగాధర్, జాని, తోళ్ళ రాకేష్,తాళ్ళ వేంకటేశ్వర్లు, కొండా శ్రీను,రాయబారపు కవిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల బాలికలు 1 లో డిజిటల్ తరగతుల నిర్వహణకు మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దాతృత్వం





కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పొంగులేటిశ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖమ్మం రాపర్తి నగర్ 1 వ డివిజన్ పరిధిలో గల మైనారిటీ జూనియర్ గురుకుల కళాశాల ఖమ్మం బాలికలు - 1 లో డిజిటల్ తరగతుల సౌకర్యాన్ని అందించేందుకు ప్రత్యేక సహకారం అందించబడింది. ఈ సందర్భంగా, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జి శ్రీ తుంబురు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, డిజిటల్ పరికరాలను విద్యార్థుల సేవలో అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఆధునిక సౌకర్యం విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు, ఆధునిక సాంకేతికత ద్వారా గుణాత్మక విద్యను అందించేందుకు దోహదపడుతుంది అని పేర్కొన్నారు. "ఇలాంటి ఆధునిక సదుపాయాలు ప్రభుత్వ కళాశాల విద్యార్థుల భవిష్యత్తును కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషిస్తాయి అని అలాగే గౌరవ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ప్రభుత్వ విద్యా రంగానికి ప్రాధాన్యం ఇచ్చి, విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు," అని చెబుతూ పాలేరు నియోజక వర్గంలో ఉన్న ప్రతీ ప్రభుత్వ పాఠశాల మరియు కళాశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దుతున్నారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ అఖిల మాట్లాడుతూ, ఈ డిజిటల్ పరికరాలు అందించడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి కి , ధన్యవాదాలు తెలియజేశారు. "ఈ సదుపాయం విద్యార్థుల స్థాయి పెంచడమే కాకుండా, వారి భవిష్యత్‌కి బలమైన పునాది వేస్తుంది," అని అలాగే ఈ ప్రారంభోత్సవం విద్యార్థులకు ఉత్తేజాన్ని అందించి, వారిలో సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంపొందించడానికి దోహదపడింది అని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజశేఖర్ ,1 వ డివిజన్ కార్పొరేటర్ తేజవత్ హుస్సేన్, అనంత రాములు ,కళాశాల టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినులుతో పాటు ప్రిన్సిపల్ అఖిల పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో నిజమైన దళితులను గుర్తించాలి
### ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నరసింహ

**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 ఆమనగల్లు:శ్రీయుత గౌరవనీయులైన షమీమ్ అక్తర్ (వారు లేకపోవడంవలన వారి






ఛాంబర్ లో )ఏక సభ్య కమిషన్ ఎస్సీ వర్గీకరణ తెలంగాణ గారిని కలిసి ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నుండి ఈ క్రింది విషయాలు విన్నవించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ లో నిజమైన దళితులకు జరుగు అన్యాయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుచూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.కొందరు వ్యక్తులు ఎస్సీ కులాల నుండి క్రైస్తవులుగా,ముస్లింలుగా మతం మారినప్పటికి కూడా,వారు అక్రమంగా ఎస్సీ హెూదాను అనుభవిస్తున్నారు.ఇది భారత రాజ్యాంగం ఎస్సీ లకు కల్పించిన హక్కులకు తూట్లు పొడిచే విధంగా ఉన్నది.నిజానికి భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 341 ద్వారా పొందుపరిచినటువంటి 1950 (షెడ్యూల్ కులాల) రాష్ట్రపతి ఉత్వరుల ప్రకారం ఎస్సీ లు మతం మారితే వారిని ఎస్సీ లుగా పరిగణించబడరాదు.వారి ఎస్సీ హెూదాను రద్దుచేయాలి,మరియు G.O.m.s:1793 తేది:23.09.1970 ప్రకారం ఎస్సీ ల నుండి క్రైస్తవం స్వీకరించిన వారు బీసీ-సి లుగా పరిగణించబడాలి లేని యెడల రిజర్వేషన్ల స్ఫూర్తిని ఖూనీ చేసినట్లే అవుతుంది.అదే విధంగా రాష్ట్రం లోని ప్రతి ఊరిలో మరియు బస్తీల్లో ఉన్న చర్చిలోని సభ్యత్వం తీసుకున్న మరియు బాప్టిజం తీసుకున్న వ్యక్తులను గుర్తించి,ఒకవేళ సభ్యులు ఎస్సీ వర్గానికి చెందిన వారైతే వారికి బీసీ-సి లు గానూ లేదా మరేదైనా ఇతర కులానికి చెందిన వారైతే రాజ్యాంగం ప్రకారం వారికి సరైన సామాజిక హెూదాను కల్పించాలి అప్పుడే సరైన కులగణన జరుగుతుంది.ఏదైనా తప్పుడు సమాచారం సేకరించి ఎస్సీ ల యొక్క హక్కులను కాలరాస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని మీకు తెలియజేయడం జరుగుతుంది. విషయాలన్నిటిని దయతో మీ దృష్టికి తీసుకువస్తున్నాము.తగు జాగ్రత్త లు తీసుకొని ఎస్సీ లకు న్యాయం చేయవలసిందిగా మా విజ్ఞప్తి.

## అభివృద్ధికి సిపిఐ వ్యతిరేకం కాదు బాధితులకు పరిహారం చెల్లించాలి
### సభ్యులు బాగం హేమంతరావు



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** ఖమ్మం నగరంలో అల్లీపూరం కొత్తగూడెం డివిజన్లలో ప్రదాన రహదారి వెడెల్పు పేరుతో పేద మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటే ఇండ్లు తొలిగిస్తున్నారని ఇండ్లు కోల్పోవడంతో ప్రజలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని రోడ్డు వెడల్పు నేపథ్యంలో ఇండ్లు షాపులు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం చెల్లించాలని ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి షేక్ జానిమియా డిమాండ్ చేశారు. ఈ రోజు ఉదయం కొత్తగూడెం డివిజన్లలో సిపిఐ బృందం కొత్తగూడెంలో రోడ్డు వెడల్పు కింద ఇండ్లు షాపులు కోల్పోతున్న బాధితులను పరామర్శించడం జరిగింది. ఈసందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ. ఖమ్మం సంభానీ నగర్ నుండి చింతకాని మండలం కొదుమూరుకు వెళ్ళేటటు వంటి రహదారి కొత్తగూడెం అల్లీపూరం రహదారి విస్తరించే దాంట్లో కొత్తగూడెం అల్లీపూరంలో అనేక సంవత్సరాలుగా ఇండ్లు నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న పేద మధ్యతరగతి ప్రజలు ఇండ్లు షాపులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వేడల్పు అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ అడ్డుకాదు కానీ అనేక సంవత్సరాలుగా ఇక్కడ పేద ప్రజలు ఉంటున్నారు కాబట్టి ప్రభుత్వం గుర్తించి తగిన నష్టపరిహారం అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థలో విలినమైన గ్రామం కొత్తగూడెం అని తెలిపారు. ఇప్పుడు రహాదారి వెడెల్పు పేరుతో సుమారు 40 పేనే ఇండ్లు కోల్పోతున్నారు వారికి వేరే ఆధారం లేదు ఎటు వెళ్ళే పరిస్థితి లేదు కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా ఆలోచన చేసి బాధితులకు తగిన న్యాయం చేయాలని ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రతానపు రామనాథం, రావుల హనుమంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, గడ్డం నాగేశ్వరరావు, మాల కొండయ్య, రావుల సంజీవరావు, షేక్. పకీర్, బుడిగ వెంకన్న, కర్రి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖబర్దార్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 ఆమనగల్లు: ఎన్టీఆర్ ఘాట్ ని తొలగించి నూతన అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తామని రాజగోపాల్ రెడ్డి ఇటీవల పేర్కొన్నారు.దీన్ని ఖండిస్తూ కల్వకుర్తి నియోజకవర్గం టీఎన్ఎస్ఎఫ్ ఇన్చార్జి కాలే శివ మాట్లాడుతూ స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు స్మృతి వనాన్ని ఏ విధంగా తరలిస్తారని ఆయన అఖండ తెలుగు జాతికి,వన్నె తెచ్చిన మహనీయుడు.రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజానీకానికి ఆయనంటే ఎంతో అభిమానం,గౌరవం. ఇప్పటికైనా ఎన్టీఆర్ ఘాట్ ని తరలించాలన్న ఆలోచనలను రాజగోపాల్ రెడ్డి విరమించుకుని తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణలు కోరాలి. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఈ ఆలోచన వచ్చిందంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య దూరం పెరుగుతుందన్నారు.ఇన్నాళ్లు టిడిపి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని చూసి సపోర్ట్ చేసిందే తప్పా,స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజలందరినీ ఒకే తాటి పైకి తీసుకొచ్చి అందర్నీ మమేకం చేసి అధికారంలోకి వచ్చిన గొప్ప మహనీయుడు తారక రామారావు.అలాంటి మహనీయుడైన ఎన్టీఆర్ ఘాట్ ని తొలగించాలనే ఆలోచన ఒక్క కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిదే నా లేక కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయమా.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే తెలుగు తమ్ముళ్ళు చూస్తూ ఊరుకోరని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తామని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
### ఇందిరమ్మ కమిటీ సభ్యుడు విజయ్ రాథోడ్



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19: ఆమనగల్లు:బడుగు బలహీన వర్గాల పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు విజయ్ రాథోడ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను గురువారం ఆమనగల్లు మండలంలోని గుడితాండ లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య తో కలిసి సర్వే చేపట్టడం జరిగింది.విజయ్ రాథోడ్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ప్రజా పాలనలో సమర్పించిన దరఖాస్తు ఆధారంగా కార్యదర్శి ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వే చేపట్టడం జరుగుతుందని,ఇందిరమ్మ పథకం కింద పూర్తి సాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇళ్ళను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీను,వినోద్, రవీందర్, తావుర్య,దేవల్లి,కవిత,హేమి, శారద తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత వ్యక్తిత్వ వికాసానికి శ్రీచైతన్య గ్లోబల్ విస్తా స్కూల్

శ్రీ జె.డి. లక్ష్మీనారాయణ ఐ.పి.ఎస్.



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ**): స్థానిక పుట్ట కోట రోడ్ లోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా స్కూల్ నందు ఈవేళ విద్యార్థులతో జె.డి. లక్ష్మీనారాయణ గారు మాట్లాడారు. దీనికి పిల్లలతో వివిధ అంశాల గురించి ముచ్చటించి వాళ్ళకి తగిన సూచనలు ఇస్తూ భవిష్యత్తులో ఎలా ఎదగాలి, ఏ విధంగా మనం సమాజానికి ఉపయోగపడాలి. వివేకానంద, మరియు అబ్దుల్ కలాం జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు. సి.వి. రామన్, న్యూటన్ వలె ఆలోచించాలి అని వివరించారు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలు గా తయారుకవలన్నారు. స్కూల్ లో ఉన్న అడ్వాన్స్ కంప్యూటర్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, అడ్వాన్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలాజికల్ ల్యాబ్స్, ప్రైమరీ పిల్లల కోసం ఏర్పాటుచేసిన యాక్టివిటీ బేస్డ్ ల్యాబ్స్ సందర్శించి మిక్కిలి కొనియాడారు. ఖమ్మం లో ఈవిధమైన ఇన్ఫ్రా తో, పిల్లలలో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించే కరికులంను ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. పిల్లలు అడిగిన ప్రశ్నలకు చాలా ఓపికతో సమాధాలు ఇచ్చారు. పిల్లలు ఆయనకు మొక్కలను బహుమతి గా ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీమతి శ్రీ విద్య మరియు పాఠశాలల డీ.జీ.ఎం శ్రీ చైతన్ మదూర్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

## బీఆర్ఎస్ పార్టీ,గిరిజన సంఘాల పోరాటంతోనే లగచర్ల రైతులు విడుదల

ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 కద్తాల్:బీఆర్ఎస్ పార్టీ,గిరిజన సంఘాల పోరాట ఫలితంతోనే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు అయ్యిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కద్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు.వికారాబాద్ జిల్లా లగచర్లలో నవంబర్ 11న ఫార్మా విలేజ్ పేరుతో జిల్లా కలెక్టర్,ఇతర అధికారులు భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో అధికారులపై దాడి చేశారన్న అభియోగాల కేసులో అరెస్టయి,జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు మరో 24 మంది రైతులకు నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.ఈ సందర్భంగా నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తున్నామని,బీఆర్ఎస్ పార్టీ,గిరిజన సంఘాల పోరాటంతో దాదాపుగా 40 రోజుల తర్వాత రైతులకు బెయిల్ మంజూరైనందుకు దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.అమాయకపు గిరిజనులను చూసుకుని దౌర్జన్యంగా వాళ్ల భూములు లాక్కొని అల్లుడికి కట్టబెడదామని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేశారని ఫైర్ అయ్యారు.ఓ పక్క రైతులను జైల్లో వేసుకుంటూ మరోపక్క రైతు పండగ చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి,సీఎం రేవంత్ రెడ్డికి రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన జోస్యం చెప్పారు.

## వీడియో జర్నలిస్ట్ కి ఐజేయూ సహాయం




కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ**): రోడ్డు ప్రమాదానికి గురైన ఖమ్మం టీవీ 5 వీడియో జర్నలిస్ట్ , జిల్లా వీడియో జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి జకీర్ హుస్సేన్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ కొంత ఆర్థిక సాయం అందించింది. ఇటీవల హైద్రాబాద్ లో జరిగిన రోడ్ ప్రమాదంలో కాలు ఫ్యాక్చర్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఇంటికి టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె .రాంనారాయణ , ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణు గోపాల్ , జిల్లా కోశాధికారి జనాతా శివ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి కనకం సైదులు,ఉపాధ్యక్షులు మామిడాల భూపాల్ రావు , టీయూడబ్ల్యూజే నాయకులు జనార్ధనాచారి , ప్రెస్ క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం , నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ , జిల్లా వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆలస్యం అప్పారావు , జిల్లా నాయకులు సంపత్ కుమార్, వినయ్ , ఫయాజ్, హర్షద్, విజయ్ పూర్ణచందర్ ,తదితరులు పాల్గొన్నారు..

## వకీల్ సాబ్ సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యేలు శంకర్ రావు,ఇందిర

వీరేందర్ రెడ్డి ద్వాదశ దినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యేలు



కేశంపేట(నేటిశుభోదయ): ప్రముఖ న్యాయవాది తెలంగాణ ఉద్యమకారుడు, షాద్ నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తాంద్ర వీరేందర్ రెడ్డి సేవలు మరువలేనివని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యేలు శంకర్రావు ఇందిరలు పేర్కొన్నారు. కేశంపేట మండలంలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో స్వగృహంలో నిర్వహించిన ద్వాదశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వీరేందర్ రెడ్డి చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. వీరేందర్ రెడ్డి సామాన్య ప్రజల పక్షాన అలుపులేని పోరాటం చేశారని గుర్తుచేశారు

## శ్రీనివాస్ యాదవ్ ను పరామర్శించిన సినీ ప్రముఖులు



తలకొండపల్లి(**నేటి శుభోదయ**): రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మాజీ ఎంపీపీ కల్వకుర్తి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి విశ్రాంత ప్రధానో ఉపాధ్యాయులు సి యల్.జంగయ్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సినిమా డైరెక్టర్ అంజి శ్రీనివాస్ సినీ హీరో విశ్వ కార్తికేయన్ నిర్మాత రామాంజనేయులు తదితరులు వెల్జాల గ్రామంలోని శ్రీనివాస్ యాదవ్ ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించి ఓదార్చారు. అనంతరం జంగయ్య సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గోద శ్రీరామ్ యాదవ్, పొద్దుటూరి రాజు,యాదయ్య,చంద్రయ్య గౌడ్,తిరుపతయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు




**(నేటి శుభోదయ):** డిసెంబర్-19: ఆమనగల్లు:హలో మాల ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ లోని మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది.మాల మహానాడు సీనియర్ నాయకులు కాలె మల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మాలలు వ్యతిరేకమన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకుంటుంటే ప్రభుత్వంపై మాలలు గెలిచినట్టేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లండం చంద్రయ్య,ఎనమల్ల రమేష్,కోరె రవి పాల్గొన్నారు.

## వెల్జాల్ గ్రామాన్ని మండల కేంద్రం గా ప్రకటించాలి

ఎమ్మార్వో వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

నిజాం ప్రభుత్వ కాలంలో ఆర్థిక రెవెన్యూ డివిజన్ గా వెల్జాల్



తలకొండపల్లి **(నేటి శుభోదయ):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ మండలం గా ప్రకటించాలని తలకొండపల్లి మండల ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు. చుట్టూ పక్కల ఉన్న 8 గ్రామాల ప్రజలు నిత్యం వెల్జాల్ గ్రామానికి వస్తూ ఉంటారు. విద్య. వైద్యం. రవాణా. వాణిజ్య పరంగా. అన్ని అవసరాలు తీరుస్తున్న గ్రామం వెల్జాల్. నిజాం ప్రభుత్వ కాలంలోనే వెల్ జాల్ లో పోలీస్ స్టేషన్ కలదు. చుట్టూ పక్కల దూర ప్రాంతాలు నాగర్ కర్నూల్. కల్వకుర్తి. జడ్చర్ల. అచ్చంపేట. సుదూర ప్రాంతాలకు ఏకైక పోలీస్ స్టేషన్ వెల్జాల్ లోనే కలదు. నిజాం ప్రభుత్వ కాలంలో ఆర్థిక రెవెన్యూ డివిజన్ గా కూడా వెల్జాల్ గ్రామం ఉండేది. అప్పట్లో నే విద్యకు రాజధాని వెల్జాల్ గ్రామం ఉండేది. సుమారు 30 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి వెల్జాల్ లో చదువు కునే వాళ్ళు.అలాంటి చరిత్ర కలిగిన వెల్జాల్ గ్రామం కాబట్టి మండల వెల్జాల్ ను మండల కేంద్రంగా ప్రకటించాలని బిజెపి నాయకులు కోరారు.

## భూసమస్యలపరిష్కార వేదిక రెవిన్యూ సదస్సులు...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ సమస్య పరిస్కారం...

తహసీల్దారు సరస్వతి...







వి.ఆర్.పురం,ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్19:-సమస్యల పరిష్కార వేదిక రెవిన్యూ సదస్సులని వరరామ చంద్రాపురం తహసిల్దార్ సరస్వతి స్పష్టం చేశారు.గురువారం మండల పరిధిలోని రామవరం పంచాయతీ లో రెవిన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా తహసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ ఆర్-ఆర్,సమస్యలు,ల్యాండ్ టూ ల్యాండ్,విన్నపాలు,రేషన్ కార్డు,పింఛెన్లు,తదితర సమస్యలు పై వినతి పత్రాలు వచ్చాయని,పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారంచేసేందుకుకృషి చేస్తామన్నారు. అన్నీ పంచాయతీ ల్లో సదస్సులు జరుగుతాయని ప్రజల సమస్యలుకోసం,అధికారులు పనిచేస్తారని చెప్పారు.ఈ సధస్సులో రెవిన్యూ ఆర్.ఐ,రామకృష్ణ,ఏ.ఎస్.డి.ఎస్.స్టాఫ్,పారెస్టు డిపార్మెంట్, సర్వేయర్లు, వి.ఆర్.వో, లు,విలేజ్ సర్వర్,సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మాతృ వియోగం



**(నేటి శుభోదయ):** డిసెంబర్-19 ఆమనగల్లు:ఆమనగల్ మున్సిపాలిటీ శివాలయం నగర్ కాలనీ కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు ఎంగలి లక్ష్మయ్య సతీమణి ఎంగలి సుశీలమ్మ స్వర్గస్తులైనారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆమె మృతదేహం సందర్శించి పూలమాలేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేసి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,మార్కెట్ డైరెక్టర్ కండె పాండు రంగయ్య,మండల అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వస్పుల మానయ్య,ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



## కెన్సర్ తో మృతిచెందిన బాధిత కుటుంబానికి బాసటగా....

జె.కె.సి.టి, ట్రస్ట్ 5000/- రూపాయలు వితరణ

వి.ఆర్.పురం,ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్ 19:-వి.ఆర్. పురం, మండలంలోని రాజుపేట కాలనీకి చెందిన ముత్యాల రాంబాబు,గత కొంతకాలంగా అనారోగ్యంతోమృతి చెందాడు. విషయంతెలుసుకున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జె.కె.సి.టి, ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ బాధిత కుటుంబాన్ని సందర్శించి, ఓదార్చి తన వంతు సాయంగా 5000/- వేలరూపాయలను అందజేశారు.కుటుంబయజమాని అకాలమరణంతో కుటుంబం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇటువంటి సహాయం చేయడంపట్ల, రాజుపేటకాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపినారు.ఈకార్యక్రమంలో మాజీ జడ్పి.టి.సి,ముత్యాల రామారావు.గ్రామపెద్దలు,సర్పరాజ్ ఆలీ, మల్లికార్జునరావు,ముత్యాల శ్రీరామ్,సవలం రాజు,తదితరులు పాల్గొన్నారు.




## ఏ.బి.సి.డి, ఎస్సీ వర్గీకరణ జరగాలి...

చదువుకున్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి..

ఏజెన్సీ ప్రాంతంలోని చదువు కున్న మాదిగలకు అవకాశాలు ఇవ్వాలి...

విద్యా!ఉద్యోగ,సామాజిక న్యాయం,అభివృద్ధిజరగాలంటే ఎస్.సి,వర్గీకరణ జరగాల్సిందే...

అల్లూరి సీతారామరాజు జిల్లా!ఏం.ఆర్.పి.ఎస్, ప్రధాన కార్యదర్శి మొద్దుగు వెంకన్న బాబు మాదిగ



వి.ఆర్.పురం,ప్రతినిధి(నేటిశుభోదయ)డిసెంబర్19:-ఏజెన్సీప్రాంతంలోచదువుకున్నమాదిగ కులస్తులకు, విద్యా, ఉద్యోగ, సామాజిక న్యాయంజరగాలంటే,ఎస్.సి. వర్గీకరణ జరిగితీరాల్సిందేనని అల్లూరి సీతా రామరాజు జిల్లా,ఏం.ఆర్.పి.ఎస్,జిల్లా ప్రధాన కార్యదర్శి మొద్దుగు వెంకన్న బాబు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం,కాకినాడ ఏక సభ్య కమీషన్,చైర్మన్ శ్రీరాజీవ్ రంజన్ మీనా,కాకినాడలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్నిఅందజేశారు. ఈసందర్భంగా, ఏం.ఆర్.పి.ఎస్, నాయకులు బింగి విష్ణుమూర్తి, మాట్లాడుతూ ఎస్.సి,వర్గీకరణ జరిగితేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని,స్పష్టం చేశారు.గురువారం కాకినాడ కలెక్ట రెట్లో ఏకసభ్య కమిటీ చైర్మన్,శ్రీ రాజీవ్ రంజన్ మీనా,కలిశామని,వినతిపత్రం అందజేశామని,వివరించారు.ఏది ఏమైనా ఎస్.సి, వర్గీకరణ దిశగా అడుగులు పడాలని అప్పుడే!మాదిగ కులస్తులకు సరైనా అవకాశాలు వస్తాయని లేకుంటే తీవ్ర అన్యాయం జరుగుతుందని,ఆయన తెలిపారు.వినతి పత్రం,సమర్పించిన వారిలో ఏం.ఆర్.పి.ఎస్,నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు,మొలకలపల్లి సరొజిని,గడ్డం కృపారావు,మొధుగు నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.








## 50,000/-వేల రూపాయల వ్యయంతో...

30,000/-వేల రూపాయల వ్యయంతో సబ్మర్జీ మోటర్,ప్యానల్స్,పైపులు...

సాంఘికసంక్షేమ హాస్టల్ కు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ చేతుల మీదుగా అందజేత...




వి.ఆర్.పురం,ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్19:- మండలకేంద్రంలోనిసాంఘిక,సంక్షేమహాస్టల్ లో, నీటిసమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో,హాస్టల్ వార్డన్ తాతాజీ, ఈవిషయాన్ని జమాల్ ఖాన్,చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సెక్రటరీ ఇమ్రాన్ ఖాన్ కు సమస్యను వివరించారు.వెంటనే స్పందించి.హాస్టల్ ఆవరణలో 50,000/-వేలరూపాయల వ్యయంతో బోరువేయించడం జరిగింది. అనంతరంబోరుకు కావలసిన మోటారు ప్యానల్సు పైపులు మొత్తం 30,000/- వేల రూపాయల విలువగల సామాగ్రిని గురువారం వార్డెన్ తాతాజీకి అందజేశారు.ఈసందర్భంగా హాస్టల్ వార్డెన్ తాతాజీ, మాట్లాడుతూ విద్యార్థులుహాస్టల్లో నీటిసమస్యతో అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న సందర్భంగా! విషయాన్ని ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకువెళ్లిన కొద్ది రోజుల్లోనే బోరు,రిగ్గు పాయింటును తీసుకువచ్చి వేయించడం జరిగిందని,ఆపై మోటారు గురించి కూడా అడిగిన వెంటనే కూడా అందజేశారని వారికి మా హాస్టల్ తరపున విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని,ఆయన స్పష్టం చేశారు.వీరి లాగానే దాతలు మరి కొంతమంది ముందుకు వస్తే!అనేక సమస్యలు పరిష్కరించబడతాయని,ఈసందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ తాతాజీ. జెకె సిటీ ట్రస్ట్ సిబ్బంది నటరాజ్,ఎస్.కే. రియాజ్.విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం...

సిబ్బంది విధులకు భంగం వాటిల్లకుండా...

ప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి ఇన్వర్టర్ అందజేసిన జె.కే.సి.టి, ట్రస్ట్ చైర్మన్,జమాల్ ఖాన్...




వి.ఆర్.పురం,ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్19:-రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం, మరియు ఆసుపత్రి సిబ్బంది విధులకు భంగం వాటిల్లకుండా విద్యుత్ అంతరాయం జరిగినప్పుడు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో!సిబ్బంది రోగుల అభ్యర్థనమేరకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్, గురువారం, ఏరియా ఆసుపత్రి సందర్శించి,29,000/- వేలరూపాయల విలువగల ఇన్వర్టర్ ను అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానవ సేవయే!మాధవ సేవని, తనసంపదనుండి ఎంతో కొంత,నిరుపేదలకోసం,కష్టాల్లో సమస్యల్లో ఉన్న వారికి సాయం చేయటం గొప్ప విషయమన్నారు. ముంపు మండలాల్లో వరదల సమయంలో నిర్వాసితులకు ఆహారం, బట్టలు. నిత్యావసరాలువంటివి సకాలంలో ప్రజలకుఅందజేశారని తెలిపారు. అంతేకాకుండాఅగ్ని బాధి తులకు ఇంటి నిర్మాణనికి కావాలసిన సామాగ్రి వంటసరుకులు కొన్నివందల, వేల, బాధితులకు ఏర్పాటు చేసిన జే. కే. సి. టి ట్రస్ట్ ద్వారా అందజేశారన్నారు. త్రాగునీటి సమస్యలు ఉన్న గ్రామాల్లో మంచి నీటి బోర్లు వేయించారని.ఇంకా ఇలా అనేక రకాల సేవ కార్యక్రమాలు చేస్తున్నారని ఏజెన్సీలో శ్రీకృష్ణదేవరాయలు పాలనలా!గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారని గుర్తు చేశారు.పేదవిద్యార్థులకు ఆర్థికంగా ఉన్నత విద్యా!అభ్యసించేందుకు గాను ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. జమాల్ ఖాన్ ను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ప్రతిఒక్కరు సేవాదృక్పథం కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ శేషారెడ్డి, డాక్టర్ ప్రేమ్,ఏ.వో.హెడ్ సిస్టర్, దుర్గ. ఇందిర,తదితరులు పాల్గొన్నారు.






## అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



(నేటి శుభోదయ): డిసెంబర్-19 ఆమనగల్లు:అభయ ఫౌండేషన్ హైదరాబాద్ వారు సంకటోనిపల్లి,చింతలపల్లి,మంగళపల్లి లో వృద్ధులకు దుప్పట్లు(రగ్గులు) పంచడం జరిగింది. ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి శీతాకాలంలో దుప్పట్లు పంచడం జరుగుతుందని ఈసారి గ్రామాలకు రావడం జరిగిందని తెలియజేశారు.ఈ రగ్గులే కాకుండా అభయ పౌండేషన్ నుండి వ్యవస్థాపకులు బాలచందర్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని. విద్య,వైద్యము,టెక్నికల్ కోర్స్ ఇలా ఎన్నో కార్యక్రమాలుజరుగుతున్నాయని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అభయ పౌండేషన్ సభ్యులు మల్లికార్జున్,శ్రీనివాస్,రంజాన్ సంజీవ్ కుమార్,రవి,భగవాన్ రెడ్డి,రూపం వెంకట్ రెడ్డి,నాగభూషణం,అశోక్ మరియు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ కళారత్న అవార్డు గ్రహీతను సన్మానించిన మాజీ ఎంపీటీసీ సభ్యులు తోట జనార్దన్ గారు



మంథని/పెద్దపల్లి,డిసెంబర్ -19 (న్యూస్ 9):ఢిల్లీలో జరిగినటువంటి బహుజన సాహిత్య అకాడమీలో అత్యంత ప్రతిభ కనబరిచిన మంథని నియోజకవర్గం, కాటారం గ్రామపంచాయతీలోని ఎర్రగుంటపల్లి వాసి గడ్డం నాగభూషణం ను శాలువాతో సన్మానించన మాజీ ఎంపీటీసీ సభ్యులు తోట జనార్ధన్ ఆయన వెంట ఎర్రగుంట పల్లె గ్రామ ప్రజలు గౌరోజు రోశయ్య, గౌరోజు పెద్ద రామన్న ,చిన్న రామన్న , తోట బాబు , బాలు నాయక్, గౌరోజు శ్రీనివాస్ ,మానెం రాజబాబు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ గారిపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందించిన పెద్దపల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ




మంథని,/ పెద్దపల్లి, డిసెంబర్ -19( నేటి శుభోదయ): భారత రాజ్యాంగ నిర్మాత మహా గొప్ప వ్యక్తి అంబేద్కర్ గారిని అవమానించడం సిగ్గు చేటని ఘాటుగా స్పందించారు. అమిత్ షా వెంటనే యావత్ భారతదేశానికి క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అంబేద్కర్ ఆశయాల పరిరక్షణకే పోరాడుతామన్నారు.డాక్టర్. బీ ఆర్ అంబేద్కర్ గారు కేవలం రాజ్యాంగ శిల్పి మాత్రమే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసిన మహానేత అని గుర్తుకు చేశారు. ఇటువంటి మహానేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మన దేశ ప్రజాస్వామ్య భావాలను అవమానించే చర్య నే అని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో న్యాయబద్ధమైన పోరాటం చేస్తామన్నారు. గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఈ అంశాన్ని పార్లమెంట్ సమీపంలో గళమెత్తి ప్రశ్నించారు. డాక్టర్ అంబేద్కర్ గారి ప్రతిష్ఠను కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా పోరాటం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాహుల్ గాంధీ తో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ దురహంకార విధానాలను ఎండగట్టారు.



## ఆమనగల్ వాస్తవ్యులు దొంతు విశ్వనాథం ఆర్థిక సహాయం

**గట్టుఇప్పలపల్లి గ్రామ పెంటమల మహేష్ కు సహాయం**

**ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జనుకుంట్ల భాస్కర్**



తలకొండపల్లి(నేటి శుభోదయ): రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామ పెంటమల మహేష్ నిరుపేద దళిత యువకుడు ఇల్లు లేదు ఈ విషయాన్ని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జనుకుంట్ల భాస్కర్ ఆమనగల్ వాస్తవ్యులు దొంతు విశ్వనాథం కు తెలియజేయడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా తన వంతు సహకారం చేస్తా అని మీ గ్రామానికి వచ్చి తన స్థితిగతులను అన్ని తెలుసుకుట. గ్రామానికి వచ్చి మహేష్ ఇంటిని సందర్శించాడు.మానవతా హృదయంతో సమాజం నుంచి తీసుకోవడమే కాదు సమాజం కూడా మన వంతు ఏదో ఒకటి చేస్తూ ఉండాలి అని అనడం జరిగింది 10,000/- రూపాయలు ఆర్థిక సహాయం కొంత సామాగ్రిని అందజేశారు. మిక్సీ, రైస్ కుక్కర్, మరి కొన్ని సామాన్లు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. మహేష్ కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో బొడ్డ అంజయ్య.మనోహర్,కళ్యాణ్ కర్అరుణ్. యంగిరాజు. యేటిరాజు. దేరంగుల ప్రవీణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ విగ్రహం కు పాలభిషేకం



**మంథని, చేరాల రవీందర్ డిసెంబర్ -19 (నేటి శుభోదయ): పార్లమెంటులో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గురువారం రోజు మంథని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం కు పాలాభిషేకం చేసి పూలమాల వేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు బెజ్జంకి డిసెంబర్, ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, బూడిద తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.**

# జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకిద్దాం...

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(నేటి శుభోదయ): రౌండ్ టేబుల్ సమావేశం-సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మతోన్మాద బీజేపీ పార్టీ జమిలి ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వ్యతిరేకిస్తుంది పార్లమెంట్లో ఆమోదం పొంది రాజ్యసభకు ఆమోదం కోసం చూస్తుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు స్పర్శ అధ్యయన వేదిక వ్యవస్థాపకులు కాకి భాస్కర్ అన్నారు జమిలి ఎన్నికల విధానాల వల్ల ప్రజలకు ప్రజాస్వామిక వాదులకు, ప్రశ్నించే గొంతులకు భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే అదేవిధంగా మనువాద సిద్ధాంతాన్ని ఈ దేశంలో ప్రత్యక్షంగా ప్రవేశపెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగంగా ఒకే ఎన్నిక ఒకే దేశం ఒకే భాష పేరిట మనువాద బ్రాహ్మణ సిద్ధాంతాన్ని పేద బడుగు ,బలహీన, అట్టడుగు సామాజిక వర్గాల ప్రజలపై దాడికి పూనుకున్నారు ఇది దేశ పౌరులపై, వారి స్వేచ్ఛపై ప్రత్యక్షమైన దాడి తప్ప మరొకటి కాదని వారన్నారు ముస్లిం మైనారిటీ ప్రజలపై దాడులకు పూనుకునేందుకు వారిని బలి పశు వులుగా మార్చేందుకు భాగంలో కుట్రగా జమిలి ఎన్నికల విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టడానికి బిజెపి ఫాసిస్టు విధానాలను తీసుకువస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు సనాతన ధర్మం పేరిట పాఠ్యాంశాల్లో విద్యార్థుల మెదల్లో విషపూరిత పురాతన అశాస్త్రీయ భావజాలాన్ని ముందుకు తీసుకొస్తున్నారు ప్రజలను కట్టు బానిసలుగా మార్చి ఎందుకు అనేక ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు ఆహారం,వేష ధారణ , ఆలోచన విధానం పై భౌతికంగా దాడి చేస్తున్నారు ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమే తప్ప ప్రజలకు మేలు చేసే విధానాలకు కాదు అని వారు హెచ్చరించారు భిన్న జాతులు భిన్న సంస్కృతులు అలౌకిక రాజ్యాంగ ఏర్పడ్డ భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే



కుట్రలో బిజెపి తన కార్యచరణ రూపొందించుకుందని వారి విధానాలను మార్చుకొని ప్రజాస్వామ్య స్వేచ్ఛకై పౌరుల భావ ప్రకటనకు భంగం కలగకుండా వారి విధానాలు ఉండాలనివారు అన్నారు అమిత్ షా పార్లమెంట్ లో బహిరంగంగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నిరంతర ఆఫీస్ నుంచి కృష్ణ హాస్పిటల్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపి అనంతరం దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు జితేందర్ రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు , జర్నలిస్ట్ చిర్ర రవి, టిపిజెఏసి నాయకులు విజయ్మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి జిల్లా కార్యదర్శి వై జానకి న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పాముల మోహన్ రావు జిల్లా అధ్యక్షులు షేక్ సుభాన్ పిడిఎస్యు జిల్లా కార్యదర్శి జి మస్తాన్ పార్టీ జిల్లా నాయకులు వై ప్రకాష్, వి వి రావు, బి నాగరాజు, పుల్లయ్య, లింగయ్య, రంగుల శ్రీను, గంగమ్మ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు

## రామగుండం సర్కిల్ ఆఫీస్, రామగుండం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన సీపీ

**ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలి**

**పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ ఉండాలి : పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్, ఐజీ**



మంథని / పెద్దపల్లి, చేరాలరవీందర్, డిసెంబర్ -19( నేటి శుభోదయ): వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం సర్కిల్ ఆఫీస్, రామగుండం పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్, ఐజి గురువారం రోజు తనిఖీ చేసారు. దీనిలో భాగంగా రామగుండం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ కమిషనర్ డిసిపి , ఎసిపి లతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు . అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును,రికార్డ్స్ పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అండర్



ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, గ్రేవ్ కేసెస్ లలో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు ,నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు పోలీస్ కమిషనర్ గారు సబ్ ఇన్స్ స్పెక్టరు ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు . నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్టే షన్ పరిధిలో జరిగే ప్రతి విషయం ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తు సమాచార సేకరణ అవరమని, బ్లూ క్లోట్స్ సిబ్బంది డయాల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి వారు సంఘటన స్థలంకి త్వరగా చేరుకోవాలని సూచించారు. వారి తో అక్కడ పరిస్థితి కంట్రోల్ కానప్పుడు వెంటనే ఎస్ఐ గారికి, సిబ్బందికి సమాచారం అందించి వెంటనే పిలిపించుకోవాలన్నారు. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది విసబుల్ పోలిసింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె



నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని, గంజాయి,మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో పెద్దపల్లి డిసిపీ చేతన ఐపిఎస్.,గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్,రామగుండము సి ఐ ప్రవీణ్ కుమార్ ,రామగుండము ఎస్ఐ సంధ్యారాణి ,ఎన్టిపిసి ఎస్ఐ ఉదయ్ కిరణ్ ,అంతర్గం ఎస్ ఐ వెంకట్ ఉన్నారు.

## వెల్జాల్ ని మండలం చేయాలని ఎమ్మెల్యే కు విన్నతి

**అన్ని అర్హతలు ఉన్న వెల్జాల్ గ్రామన్ని వెంటనే మండలం చేయాలి.**

**కాంగ్రెస్ పార్టీ నాయకులు**



తలకొండపల్లి(నేటి శుభోదయ): రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం లోని వెల్జాల గ్రామాన్ని నూతన మండలం గా ఏర్పాటు చేయాలని వెల్జాల్, వెంకటాపూర్, చౌదర్ పల్లి, మాదాయ పల్లి, అంతారం, జూలపల్లి, చంద్రధాన, సంగాయ పల్లి, గ్రామాల నాయకులతో కలిసి స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, జి.శ్రీనివాస్ మూర్తి, ఎం.అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్, అజీజ్, సీనియర్ నాయకులు కే నర్సిరెడ్డి, సి చెన్నారెడ్డి, పి అశోక్ బాబు, ఎస్ శ్రీనివాసులు, ఎండి రహీం, రాజేందర్ రెడ్డి,ఏ రవి కిరణ్ రెడ్డి, పబ్బతి వెంకటయ్య, టి కృష్ణయ్య గౌడ్, మండల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు, ఎం.డి.అరిఫ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి. అబ్బాస్, యువ నాయకులు, వద్దే రాజు, చింతకాయల లక్ష్మణ్, పులిజాల విష్ణు, మిడత రమేష్, పద్ధతి రాజు, వాన రాసి గణేష్, తదితరులు పాల్గొన్నారు

## జ్ఞాన వాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానోత్సవం

(నేటి శుభోదయ): డిసెంబర్:19 ఆమనగల్లు:ఈనెల 10వ తారీకు నిర్వహించిన చూచి వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం ఆమనగల్ మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ బస్టాండ్ హై స్కూల్ నందు జరిగింది. విజేతలైన విద్యార్థులకు దాతలచే నగదు బహుమతి తో పాటు మెమెంటోస్ ఇవ్వడం జరిగింది. మొదటి బహుమతిగా ప్రతీ తరగతికి 3000/-రూపాయలు రెండవ బహుమతిగా 2000/- రూపాయలు,మూడో బహుమతి గా 1000/- రూపాయలు మరియు ప్రతి తరగతి విద్యార్థికి ప్రోత్సాహ బహుమతిగా 500/-రూపాయలు 4 మండలాల విద్యార్థులకు ఇవ్వడం జరిగింది.నగదు దాతలు వెంకటేశ్వర థియేటర్ భారతమ్మ వాసవి ఎడ్యుకేషన్ సొసైటీ వారు ప్రవీణ్ మెడికల్ హాల్ ప్రవీణ్,గుత్తి మురారి ఆయిల్ మర్చంట్,హైమావతి రిటైర్డ్ టీచర్ మదనమోహన్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భోజన సదుపాయం చేసిన తల్లోజు వెంకటయ్య మరియు ఫౌండేషన్ అధ్యక్షులు జూలూరు రవీంద్రనాథ్,ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ,కోశాధికారి కాడిగే సత్యం,రంగారావు, గౌ,,అధ్యక్షులు కే సత్యనారాయణ,డా,,బి శ్రీనివాస్,బిక్కుమాండ్ల నరసింహ,కోట రామకృష్ణ తోపాటు ఫౌండేషన్ సభ్యులు ఉపాధ్యాయుల తో పాటు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



## పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే నిర్వహణ..

**ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి, డిసెంబర్-19 ( నేటి శుభోదయ): ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా జిల్లాలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.



గురువారం పెద్దపల్లి పట్టణం అమర్ నగర్ చౌరస్తా వద్ద 35వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్ లతో సహకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్ లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని, సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు లాగిన్లు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్ లో అప్లోడ్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్దే తుమ్మల ధ్యేయం - మేయర్ నీరజ



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ):** ఖమ్మం జిల్లా ఖమ్మం నగర సమగ్ర అభివృద్దే ధ్యేయంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరావు పనిచేస్తున్నారని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ప్రజా సమస్యలన్నింటిని ప్రజా సర్కార్ పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి రాగానే వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు సూచనల మేరకు కళ్యాణ లక్ష్మి చెక్కులను 17,30,32.33,36,46,47 డివిజన్ లో పంపిణీ చేసాము,, తుమ్మల హైదరాబాదులో పని ఒత్తిడి కారణంగా రాలేకపోయారని, అందుకే చెక్కులను ఆలస్యం చేయకుండా సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని తమకు సూచించారని మేయర్ నీరజ వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర్ తిలక్ మరియు కాంగ్రెస్ ప్రముఖులు -బాణాల లక్ష్మణ్ దేవత శంకర్ నాయక్ దానాల వెంకటరమణ, జహీర్ శ్రీశైలం బొమ్మ ఉదయ్ కుంచపు వెంకటేశ్వర్లు, వాసంశెట్టి భరత్, సందాల రఘు, పుట్నాల అజయ్ , కీత శ్రీను, చట్టు మంగ,లింగం పల్లి సైదులు దేవత దివ్య, రుణ వత్తు రమాదేవి, తోళ్ల రాకేష్ చంద్ర,ముద్దు కృష్ణ, శ్రీను,అర్చన, దుర్గ, అప్పల రవి టి రాంబాబులి గజ్జి సూర్యనారాయణ,సాదే శంకర్ తురక వీరభద్రమ్ పిడుగు మల్లికార్జున్ పిడుగు ఉపేందర్ గెల్లా కృష్ణవేణి, గూడెపు నాగరాజు లిఎస్.కె రజ్జి సింగం అంజయ్య బోజెడ్ల సత్యనారాయణ, జట్టు కృష్ణయ్య మురారి వీరేష్ రేగు రవీందర్ తుపాకుల మధు చల్లా రమేష్ ఎస్కె జాకీర్, లింగస్వామి జానీ సురేషు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## సమాజంలో అలజడి, సృష్టించాలనే కుట్రలో భాగమే రెచ్చగొట్టే వ్యాఖ్యలు

**అమీషాపై తక్షణమే దేశద్రోహం కేసు నమోదు చేసి జైలుకు పంపాలి**

**మంథని నియోజకవర్గ ఇంఛార్జి జనగామ రవికుమార్,**



మంథని, చేరాల రవీందర్, డిసెంబర్-19(నేటి శుభోదయ): పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హెూం శాఖ మంత్రి అమీషా ప్రసంగిస్తూ ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడుతూ చిన్న చూపుతో అంబేద్కర్ ని అవమానించే విధంగా ప్రసంగించారని, ఆ మాటలను వెంటనే ఉపసంహరించుకోని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంథని నియోజకవర్గ ఇంఛార్జి జనగామ రవికుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరును హేళనగా మాట్లాడడం అంటే, భారతదేశాన్ని హేళనగ మాట్లాడడమేనని, అమిత్ షా కళ్ళు అధికార గర్వంతో నెత్తికెక్కాయని విమర్శించారు, అంబేద్కర్ దేశ అభివృద్ధికి దిక్సూచి అంబేద్కర్ పేరు అనేది ఈ దేశంలో ఈ క్వాలిటీ ప్రిన్సిపుల్ అని, ఈ దేశంలో 85 శాతం మంది ప్రజల ఫ్యాషన్ అంబేద్కర్ పేరని తెలిపారు. అమీత్ షాకు అధికార గర్వంతో కళ్ళు నెత్తికెక్కి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించి విధంగా, సమాజంలో అలజడి సృష్టించాలని కుట్రలో భాగమే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన అమీషాపై తక్షణమే దేశద్రోహం కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేసారు.

### తాసిల్దార్ కు వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు




ముత్తారం మండల ప్రతినిధి(**నేటి శుభోదయ):** డిసెంబర్-19 ముత్తారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో గురువారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాసిల్దార్ కు వినతిపత్రం అందిచారు.సీతంపేట,పోతారం,ఓడేడు,గ్రామాలలో ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేస్తున్నారని.దీని పై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని,తాసిల్దార్ కు అందించిన వినతిపత్రంలో సూచించారు.గత 10ఏళ్ల



బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూముల గురించి చాలాసార్లు వినతిపత్రం అందించి ఈభూములను కాపాడాం.కానీ ఇప్పుడున్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ భూములను కొంతమంది అధికారులా కనుసన్నల్లో కబ్జా చేసి ఆ భూములలో పంట సాగు చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఎమ్మార్వో కు వివరించడం జరిగింది.

### అనంతరం ప్రెస్ మీట్ పెట్టిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

ముత్తారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోతుపెద్ది కిషన్ రెడ్డి మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భూములు కబ్జాలు అధికంగా పెరిగాయని అన్నారు.మండలం కేంద్రంలోని సీతంపేట గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీ భూమిని,మరియు ఓడేడు గ్రామంలో రెండు చెరువులను,పోతారం గ్రామం శివారులో గల సర్వే నెంబర్ 59లోని భూమిని కబ్జా చేసేదందుకు ప్రయత్నం చేస్తున్నారని.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు కబ్జా చేస్తున్న భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా మండల రెవెన్యూ అధికారి కి మాత్రమే సాధ్యమని ఒక వేళ ఈ భూములు కబ్జా అయితే భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ తరుపున రాస్తారోకలు ధర్నాలు చేస్తాం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,మాజీ వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నూనె కుమార్,ముత్తారం గ్రామం శాఖ అధ్యక్షులు అలువోజు రవీందర్,తిత్తుల శ్రీనివాస్,తాత బాలు, రామగళ్ళ మధుకర్,మల్యాల రాజయ్య,కూరాకుల ఓదెలు, గాదం శ్రీనివాస్,పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.....

**జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష**

**విద్యార్థులలో పఠనం ,గణితం సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు**

**ప్రాథమిక విద్య బలోపేతం పై సంబంధిత అధికారులతో రివ్యూ సమావేశం**

**నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి, చేరాలరవీందర్, డిసెంబర్ -19 ( నేటి శుభోదయ): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య బలోపేతం



చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపెల్లి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... ప్రాథమిక విద్యను మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులంతా కలిసి కృషి చేయాలని , విద్యార్థులలో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు బోధన ప్రక్రియలో కొన్ని లోటు పాట్లు గమనించడం జరిగిందని, వాటిని గుర్తించి అన్ని పాఠశాలలలో వీటిని అభివృద్ధి చేయుటకు జిల్లాలోని ఒక వెయ్యి 75 మంది ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు డిఆర్పీల ద్వారా 14 మండలాలలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. పాఠశాలలో బోధన విధానంలో ఉన్న లోపాలను సవరించుకొని మీ పాఠశాలలోని 80 శాతం పిల్లలలో పఠన ,గణిత సామర్థ్యాలు పెంచినట్లయితే జిల్లా స్థాయిలో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రోత్సాహక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలపడం జరిగింది. విద్యార్థులలో సామర్థ్యాలను పెంచుటకై మధ్యాహ్నం షెడ్యూల్ లో ఏడు, ఎనిమిది పీరియడ్స్ ను రిమీడియట్ బోధనను నిర్వహించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో బిజెపి కాంగ్రెస్ ను ఓడించండి

**ప్రజాశాంతి పార్టీ తో గెలిచిన సర్పంచ్ లకు భారీగా నిధులు**

**వంద రోజుల్లో గ్రామ అభివృద్ధి**

**ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం జిల్లాలో అభివృద్ధి శూన్యం**

**ప్రజాశాంతి పార్టీ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్త క్యాంపియన్లు**

**విలేకరుల సమావేశంలో డాక్టర్ కే ఏ పాల్**




కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ):** త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీలను ఓడించాలని, ప్రజాశాంతి పార్టీ ద్వారా గెలిచిన సర్పంచ్ లకు భారీగా నిధులు కేటాయిస్తూ వంద రోజుల్లో ఆ గ్రామాలను సమగ్ర అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కె ఏ పాల్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. , ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దేశ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన అభివృద్ధికి దూరంగా కొనసాగుతు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, అవినీతి పాలన చేసిన బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి సాగనంపారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా భద్రాచలం నుంచి ఖమ్మం దాకా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఎక్కడ చూసినా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించలేదని, దోచుకోవటం దాచుకోవటమే వారికి పనిగా మారిందని దుయ్యబట్టారు. ప్రజలపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలను వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మిగులు బడ్జెట్ గా ఉన్నా రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాశాంతి పార్టీ ద్వారా గెలిచే గ్రామ సర్పంచ్ కి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో సమగ్ర అభివృద్ధి చేసి చూపిస్తామని అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాశాంతి పార్టీ బలోపేతం కోసం క్యాంప్యాన్లను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విదేశాల నుంచి డబ్బును సేకరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, తాగునీరు విద్యా ,వైద్యం, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే గ్రామ సర్పంచ్ అభ్యర్థులు ప్రజాశాంతి పార్టీని ఆదరించి పెద్ద ఎత్తున చేరికలు చేపట్టాలని డాక్టర్ కె ఏ పాల్ పిలుపునిచ్చారు.

## అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి..



**అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలకు కండన**

**కేంద్ర హెూం మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళనలకు పిలుపు**

**అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని మోడీ సమర్థించడం సరికాదు**

**సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభల సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ):** సత్తుపల్లి, దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. దళితుల వెనుకబాటుతనాన్ని, అంటరానితనాన్ని తీవ్రంగా ప్రశ్నించి, తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాలకు అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పలుచన చేస్తూ వ్యాఖ్యలు చేయడం, వాటిని ప్రధానమంత్రి మోడీ సమర్థించడాన్ని తమ్మినేని ఖండించారు. సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలకు పరిశీలకులుగా హాజరైన తమ్మినేని మహాసభల ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజలను ఎలా పాలించాలో సమానత్వ సిద్ధాంతాన్ని కూడా ముందుకు తీసుకువచ్చింది అంబేద్కర్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దళితులకు రిజర్వేషన్ కేటాయింపులో అంబేద్కర్ కృషి ప్రత్యేకమైనది అన్నారు. ఇంత చరిత్ర ఉన్న ఓ మహనీయున్ని చులకన చేస్తూ మాట్లాడటాన్ని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యాంగ మార్పు అనేది బీజేపీ లక్ష్యమని, దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలనే యోచనలో భాగంగానే అమిత్ షా అంబేద్కర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని తమ్మినేని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పు మరొకటి కాదన్నారు . పైపెచ్చు కేంద్ర హెూం మంత్రి వ్యాఖ్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థించడంపై మండిపడ్డారు. హెూంమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకట్, పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

### అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో మహాసభల ప్రాంగణం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ ఎదుట గురువారం కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మకు నిప్పంటించి అనంతరం మాట్లాడారు. అంబేద్కర్ దళిత హక్కులు, అంటరానితనం నిర్మూలన కోసం పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ ప్రజలకు ఓ రాజ్యాంగం ఉంది.. దీనిలో సమానత్వ ప్రతిపాదనలు అనేకం ఉన్నాయని వెల్లడించారు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలని, లౌకికతత్వం పాటించాలని, ప్రజాస్వామ్యం కాపాడబడాలని,



రాజ్యాంగ సంస్థలను స్వతంత్ర ప్రతిపత్తితో నడపాలనే ప్రతిపాదనలు రాజ్యాంగంలో పొందుపరిచినట్లు వివరించారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులను కల్పించిన చరిత్ర అంబేద్కర్ దని తెలిపారు. అటువంటి అంబేద్కర్ ను అవమానించడం అమిత్ షా దురహంకారానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అంబేద్కర్ పై అమిత్ షాక్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ (ఎం) 22వ మహాసభల్లో తీర్మానం చేశామని వెల్లడించారు. మహాసభల అనంతరం ఉరూరా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు

### ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలపై వ్యతిరేకత

**సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్**

ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలపై వ్యతిరేకత కొనసాగుతోందని సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్ తెలిపారు. కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం నెలకొన్న దృష్ట్యా దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ ఖమ్మం జిల్లా 22వ మహాసభలను ఉద్దేశించి ఆయన గురువారం మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులలో అభద్రతాభావం పెరిగిందన్నారు. కులం, మతం పేరుతో ప్రజలను వర్గీకరిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాల మీద వ్యతిరేకత కొనసాగుతుందని, కమ్యూనిస్టులు అనుకూలమైన పరిణామాలు నెలకొన్నాయన్నారు. దానికి ఉదాహరణే శ్రీలంకలో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం అని తెలిపారు. కమ్యూనిస్టులు జనంతో గడుపుతూ వర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. పార్టీ బలోపేతం ద్వారా వర్గ పోరాటాలను మరింతగా ముందుకు తీసుకెళ్లవచ్చు అని తెలిపారు. అస్థిత్వ రాజకీయాల్లోకి కమ్యూనిస్టులు ప్రవేశించవద్దని సూచించారు. మార్క్సిస్టు దృక్పథంతో సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు ప్రజలతో మరింతగా మమేకమవుతూ ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

## మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం.. భారత్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్ : తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన విలేకరులతో అన్నారు. 'వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం' అని అన్నారు.

## భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

### చైనా విదేశాంగ మంత్రితో అజిత్ దోవల్ భేటీ

### సరిహద్దు సమస్య సహా పలు అంశాలపై చర్చలు



బీజింగ్ : సరిహద్దుల్లో శాంతి స్థాపన, గత నాలుగేళ్లుగా స్తంభించిన ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణతో సహా పలు అంశాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మధ్య బుధవారం చర్చలు జరిగాయి. భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న దోవల్ మంగళవారమే ఇక్కడకు చేరుకున్నారు. ఐదేళ్ల విరామం అనంతరం జరుగుతున్న ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో పాల్గొనేందుకు వీరు అక్కడకు వెళ్లారు. చైనా కాలమానం ప్రకారం ఉదయం 10గంటలకు చర్చలు ఆరంభమయ్యాయి. తూర్పు లడఖ్‌లో గస్తీకి, బలగాల ఉపసంహరణ కుదిరిన ఒప్పందం నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్మించుకునేందుకు పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరుపుతున్నారు. భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా వుందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మీడియాకు తెలిపారు. ఇరు దేశాల నేతల మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహన, సర్దుబాటును అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాలను గౌరవిస్తూ, చర్చలు, కమ్యూనికేషన్ ద్వారా పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలని నేతలు భావించారు. సరిహద్దుల్లో శాంతి భద్రతల నిర్వహణపై ఇరు దేశాల ప్రత్యేక ప్రతినిధులు చర్చించనున్నారు. సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అన్వేషించాలని నిర్ణయించారు.

## సజ్జల భార్గవ్ క్వాష్ పిటిషన్.. ప్రతివాదులకు కోర్టు నోటీసులు



అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత సజ్జల భార్గవ్ రెడ్డి క్వాష్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం, తదుపరి విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. అంతకుముందు.. ఏపీ హైకోర్టులో సజ్జల భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇది అసలు విచారణ అర్హత లేని కేసంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారాయన. ఈ కేసులకు అసలు విచారణ అర్హత లేదు. ఎవరు పైన అయితే పోస్ట్ పెట్టారో వాళ్లు కంప్లైంట్ చేయలేదు. ఎవరో మూడో వ్యక్తి కంప్లైంట్ చేస్తే కేసు నమోదు చేశారు. ఈ పోస్టులపై ఐటీ సెక్షన్స్ బదులుగా.. పోలీసులు నాన్‌బెయిలబుల్ సెక్షన్స్ పెట్టారు. ఇది ఆర్గనైజర్ క్రైమ్ అని పోలీసులు చెప్తున్నారు. కానీ, ముమ్మాటికి ఇది అలాంటి నేరమేం కాదు అని పొన్నవోలు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. విచారణను వాయిదా వేసింది. ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దన్న ఆదేశాలను పొడిగిస్తున్నట్లు తెలిపింది.

## మళ్లీ డయేరియా కలకలం..

## 15కు చేరిన బాధితుల సంఖ్య



అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో డయేరియా కలకలం సృష్టిస్తోంది. జిల్లాలో డయేరియా బాధితుల సంఖ్యల 15కు చేరుకుంది. వరుస డయేరియా కేసుల కారణంగా ఉమ్మడి విశాఖ జిల్లావాసులు భయంతో వణికిపోతున్నారు. ఇక, డయేరియా ఎందుకు ప్రబలింది అనేది ఇప్పటికీ స్పష్టత రాలేదు. వివరాల ప్రకారం.. అనకాపల్లిలోని పరవాడ మండలం, భరణికం గ్రామంలో డయేరియా విజృంభిస్తోంది. తాజాగా డయేరియా బాధితుల సంఖ్య 15కు చేరుకుంది. ప్రస్తుతానికి ఇద్దరు, ముగ్గురు స్వల్పంగా కోలుకున్నారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరో 11 మంది చికిత్స తీసుకుంటున్నారు. మరో ఇద్దరిని స్థానికంగా ఉన్న కేర్ ఆసుపత్రికి తరలించారు. ఇటీవలి కాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో డయేరియా కేసుల సంఖ్యల పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వణికిపోతున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలో డయేరియా ఎందుకు ప్రబలిందో ఇప్పటికే స్పష్టత రాకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డయేరియా కేసులు భారీ పెరుగుతున్నాయి. ఇప్పటికే డయేరియా బారినపడి పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, డయేరియా వ్యాధి ప్రబలకుండా చేయడం కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాధితులు, వారి కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. అంతకుముందు గుర్లాలో డయేరియా కారణంగా పలువురు ఇబ్బందులు ఎదుర్కొగా.. వ్యాధి కారణంగా మరికొందరు మృతిచెందారు.

# 'జమిలి'కి వేళయిందా?!




మొత్తానికి బీజేపీ చిరకాల వాంఛ నెరవేరటంలో తొలి అడుగుపడింది. దేశంలో జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా బిల్లులు మంగళవారం లోక్‌సభలో ప్రవేశించాయి. అందరూ అనుకున్నట్టే ఈ బిల్లులకు విపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. వచ్చినంత వేగంగా రెండు బిల్లులూ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు వెళ్లబోతున్నాయి. తరచు జరిగే ఎన్నికల వల్ల పాలనా నిర్వహణలో అస్థిరత నెలకొంటున్నదని, కీలకమైన ప్రాజెక్టుల సాకారంలో అంతులేని జాప్యం చోటుచేసుకుంటున్నదని, ఎన్నికలకు తడిసి మోపెడు వ్యయం అవుతున్నదని ప్రభుత్వ పెద్దలు చాన్నాళ్లుగా వాదిస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై స్పష్టత వుంటే పాలన కుంటు పడదని, అధికార యంత్రాంగంపైనా, ఖజానాపైనా భారం తగ్గుతుందని, వోటింగ్ శాతం పెరుగు తుందని వారి వాదన. ఈ విషయమై కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో నియమించిన బృందం సైతం పాలకుల వాదనకు అనుకూలంగా సిఫార్సులు చేసింది. జమిలి ఎన్నికల వల్ల సుస్థిరత ఏర్పడి పెట్టుబడులు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధికి వీలవుతుందని, వనరుల కేటాయింపు సమర్థంగా చేయొచ్చని వివరించింది. మతపరమైన ఉద్రిక్తతలు తగ్గి భద్రతా బలగాల వినియోగం పెద్దగా ఉండబోదన్నది ఆ బృందం అభిప్రాయం. జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలోని 83, 172, 324 అధికరణాలను సవరించాల్సి వుంటుంది. అందుకోసమే ఈ బిల్లుల్ని ప్రవేశపెట్టారు. వోటర్ల జాబితాకు సంబంధించి రాజ్యాంగంలోని 325 అధికరణను సవరించే మరో బిల్లు అవసరమవుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆధ్వర్యంలో లోపరహితమైన జాబితా రూపొంది లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ఏకకాలంలో జరుగుతాయని ప్రభుత్వం చెబుతోంది. అంటే జమిలి కేవలం ఈ రెండు సభలకు సంబంధించిందే. ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలుంటాయి. మొత్తానికి ఎన్నికల జాతర అయిదేళ్లకోసారి మాత్రమే ఉంటుంది. మధ్యలో ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం కుప్పకూలి అసెంబ్లీ ఎన్నికలు తప్పనిసరైతే వాటిని జరుపుతారట. కానీ ఆ కొత్త ప్రభుత్వాల ఆయుష్షు ఆ మిగిలిన సంవత్సరాలకు మాత్రమే పరిమితమవుతుందట. అంటే అయిదేళ్ల కాలానికి ఎన్నికైన ప్రభుత్వం మూడేళ్లకే పతనమైతే... కొత్తగా ఎన్నికలై వచ్చే పాలకులకు కేవలం రెండేళ్లు మాత్రమే పదవీయోగం దక్కుతుందన్నమాట! సారాంశంలో 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' ఆదర్శం కాస్తా అట కెక్కినట్టే అవుతుంది. మరి ఈ బిల్లులు సాధించదల్చుకున్నదేమిటి? ఈ బిల్లులు గట్టెక్కటం అంత సులభమేమీ కాదు. ఏ రాజ్యాంగ సవరణ బిల్లుకైనా మూడింట రెండువంతుల మెజారిటీ తప్పనిసరి. ఆ రకంగా చూస్తే 543 మంది సభ్యులున్న సభలో ఈ బిల్లు లకు మద్దతుగా కనీసం 362 మంది వోటేయాలి. కానీ ఎన్డీయే బలం 293. అంటే మరో 69 మంది మద్దతు అవసరమవుతుంది. రాజ్యసభ వరకూ చూస్తే 163 మంది బిల్లులకు అనుకూలంగా వోటే యాలి. కానీ ఎన్డీయే బలం 121. ఆ తర్వాత రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం కూడా తప్పనిసరి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన చట్టాలు మార్చాలంటే కనీసం సగం అసెంబ్లీలు అందుకు అంగీ కరించాలి. కోవింద్ కమిటీ ముందు 47 రాజకీయ పక్షాలు తమ అభిప్రాయాలు వినిపించాయి. 32 పార్టీలు అనుకూలం కాగా, 15 పార్టీలు 'ఒకే దేశం – ఒకే ఎన్నిక'కు వ్యతిరేకమని తేలింది. ప్రజాస్వామ్యమంటే కేవలం అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికలు మాత్రమే కాదన్న సంగతి పాలకులు మరిచిపోయి చాన్నాళ్లయింది. ఎన్నికల్లో చెప్పేది ఒకటైతే, గెలిచాక చేసేది మరొకటి.కేంద్రంలో మాత్రమే కాదు... ఏపీలోని ఎన్డీయే పాలన చూసినా ఈ సంగతి ఇట్టే అర్థమవుతుంది. ఏపీలో నదురూ బెదురూ లేకుండా ఇచ్చిన వాగ్దానాలన్నిటికీ ఎగనామం పెట్టారు. ఇక ఎక్కడ ఎన్ని కలు జరిగినా ఈవీఎంలపై అనుమానాలు మొదలవుతున్నాయి. ఏపీలో ఎన్నికలు పూర్తయినవెంటనే ఈసీ ప్రకటించిన ఓట్లకు లెక్కించినప్పుడు అదనంగా మరో పన్నెండున్నర శాతం ఓట్లు వచ్చిచేరాయి. దేశంలో అత్యధిక నియోజకవర్గాల్లో సగటున వెయ్యి ఓట్లు ఇలా అదనంగా చేరినట్టు బయటపడింది. దీనిపై సంజాయిషీ ఇవ్వాలన్న కనీస సంస్కారం ఈసీకి లేకపోగా... ఈవీఎంలలో పోలైన ఓట్లనూ, వీవీ ప్యాట్ స్లిప్‌లనూ సరిపోల్చాలన్న వినతుల్ని బుట్టదాఖలా చేసింది. పైగా అతి తెలివి ప్రదర్శించి డమ్మీ పోలింగ్ నిర్వహణకు దిగింది! ఏపీకి సంబంధించినంతవరకూ అయితే గడువుకు ముందే వీవీ ప్యాట్ స్లిప్‌లను ధ్వంసం చేశారు. ఈవీఎంల డేటా తొలగించారు. ఈ వైపరీ త్యాలపై తామేం చేయాలన్న స్పృహ, వివేకం కేంద్ర పాలకులకు లేకపోగా... 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' లోనే దేశ భవిష్యత్తు సర్వం ఆధారపడి వున్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నారు.పైగా ఈ మాదిరి ఎన్నికలు ప్రాంతీయ ఆకాంక్షలనూ, అవసరాలనూ పాతరపెడతాయన్న ఆరోపణలకు సరైన జవాబు లేదు. ఈ విధానం దేశ ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీస్తుందన్న విమ ర్శను బేఖాతరు చేస్తున్నారు. అసలు 140 కోట్ల జనాభా... 30 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతా లున్న దేశాన్నీ... లెక్కకు మిక్కిలివున్న పార్టీలనూ 'జమిలి' చట్రంలో బిగించి ఒక్క వోటుకి కుదించాలన్న ప్రతిపాదనే వింతై నది. దానిపై బిల్లులు పెట్టేముందు విస్తృతంగా చర్చించి ఏకాభిప్రాయం సాధించాలన్న కనీస ఇంగితజ్ఞానం కొరవడితే ఎలా? అగ్రరాజ్యమైన అమెరికాలోనే నాలుగేళ్లకోసారి అధ్యక్ష ఎన్నికలు జరుపుతూ, రాష్ట్రాల సెనేట్‌లకూ, స్థానిక సంస్థలకూ, ప్రతినిధుల సభకూ నిర్ణీత కాలంలో విడివిడిగా ఎన్నికలు నిర్వహిస్తుండగా దాదాపు 97 కోట్లమంది వోటర్లున్న ఈ అతి పెద్ద దేశంలో జమిలికి తహతహలాడటంలోని మర్మమేమిటి?

# మైత్రీబంధంలో శుభ పరిణామం



ఇది కొంత ఊహించని పరిణామమే కావచ్చు. కానీ కొత్త ఆశలు చిగురింపజేసిన సంఘటన.శ్రీలంక నూతన అధ్యక్షుడు అరుణ కుమార దిసనాయకె తన తొలి విదేశీ పర్యటనకు భారతదేశాన్ని ఎంచుకోవడం, ఢిల్లీ రావడం ఇరుదేశాల మధ్య సత్సంబంధాలకు సానుకూల సూచన. శ్రీలంకలోని అధికార నేషనల్ పీపుల్స్ పవర్ కూటమిలో ప్రధాన భాగస్వామి, సైద్ధాంతికంగా మార్క్సిస్టు భావజాలం వైపు మొగ్గుచూపే రాజకీయ పక్షమైన జనతా విముక్తి పెరుమున (జేవీపీ), దానికి సారథిగా దిసనాయకె చైనా పక్షం వహిస్తారని భావించారు. పైగా రుణాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులు సహా అనేక అంశాలలో ఆధారపడ్డ కొలంబోపై బీజింగ్ ప్రభావమూ తక్కువేమీ కాదు. మరోపక్క, 1980లలో ద్వీపదేశంలో తమిళ వేర్పాటువాదులతో శ్రీలంక అంతర్యుద్ధ వేళ సైన్యాన్ని పంపడం ద్వారా భారత జోక్యం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, జేవీపీ ఆది నుంచి భారత వ్యతిరేక వైఖరితో వ్యవహరించేది. పైపెచ్చు కొంత కాలంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రాబల్యం కోసం చైనా దూకుడుగా సాగుతూ, మనకు గుబులు పుట్టిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత ప్రయోజనాలకు విరుద్ధంగా శ్రీలంక భూభాగాన్ని వినియోగించుకొనేందుకు అనుమతించేది లేదంటూ భారత పర్యటనలో శ్రీలంక అధ్యక్షుడు ఇచ్చిన హామీ మండువేసవిలో పన్నీటిజల్లు లాంటిది. ఉమ్మడి భద్రతా ప్రయోజనాలు, పరస్పర విశ్వాసం, పారదర్శకతతో క్రమం తప్పకుండా జరపా ల్సిన చర్చలను ఉభయ దేశాల సంయుక్త ప్రకటన ప్రతిఫలించడం విశేషం. ద్వీపదేశాధ్యక్షుడికీ, భారత ప్రధాని మోదీకీ మధ్య భేటీ ఉత్సాహజనకంగా సాగడం చెప్పు కోదగ్గ అంశం. భారత విదేశీ విధానానికి దీన్ని ఓ విజయ సూచనగానూ భావించవచ్చు. రాజపక్స లాంటి శ్రీలంక నేతలు భారత్‌ను అనుమానిస్తూ, ఉద్దేశపూర్వకంగానే చైనా గాఢపరిష్వంగంలోకి చేరిన సందర్భంలో... నూతన అధ్యక్షుడు తన తొలి పర్యటనకు చైనాను కాక భారత్‌ను ఎంచు కోవడం మళ్ళీ పల్లవిస్తున్న స్నేహరాగం అనుకోవచ్చు. వెరసి, చైనాకు స్వల్పంగా దూరం జరిగి, మళ్ళీ భారత్‌తో చిరకాల బంధాలను పునరుద్ధరించుకోవడానికి శ్రీలంక ముందుకు రావడం మారు తున్న ఆలోచనా సరళికి సంకేతం. నిజానికి, కరోనా అనంతర కాలంలో ఆర్థికవ్యవస్థ కుప్ప కూలి పోయి, చేదు అనుభవాలు ఎదురుకావడంతో కొలంబో మార్పు వైపు చూసింది. దానికి తోడు అక్కడ మునుపటి వంశపారంపర్య, కుటుంబపాలిత రాజకీయ పార్టీల స్థానంలో కొత్త రాజకీయ నాయకత్వ ఆవిర్భావం మరింత తోడ్పడింది. అలాగే, ఇరుగుపొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్య మంటూ భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం లంకేయుల్ని ఆకట్టుకుంది. 2022లో శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయినప్పుడు 500 కోట్ల డాలర్ల పైచిలుకు మేర భారత్ సాయంమరువరానిది. ఇవన్నీ కొలంబో ఆలోచనలో మార్పుకు దోహదం చేశాయి. హంబన్‌తోట నౌకాశ్రయాన్ని 99 ఏళ్ళ లీజు మీద చైనాకు కట్టబెట్టడం సహా అనేక తప్పులు శ్రీలంకను వెంటాడాయి. అప్పటి రాజపక్సే సర్కారు వైఖరితో దేశం అప్పుల కుప్పయింది. అలాగే, నిన్నటి దాకా చైనా నౌకలు తమ గూఢచర్య యాత్రలు సాగిస్తూ, నడుమ శ్రీలంక నౌకాశ్రయాల్లో నిష్పూచీగా లంగరు వేసేవి. కానీ, ఇప్పుడు దిసనాయకె తాజా ఆశ్వాసనతో పరిస్థితి మారింది. చైనా నౌకలకు అది ఇక మునుపటిలా సులభమేమీ కాదు. ఇంతమాత్రానికే శ్రీలంకపై చైనా పట్టు సడలిందనుకోలేం. ఢిల్లీ, కొలంబోల మధ్య పాత కథలకు తెరపడి, కొత్త అధ్యాయం మొదలైందనుకో వచ్చు. లంకకు నిధుల అందజేతలో చైనాతో పోటీ పడలేకున్నా, రక్షణ సహా అనేక అంశాల్లో భారత – శ్రీలంకల మధ్య ఒప్పందాలు కలిసొస్తాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, సౌరశక్తి – పవన విద్యుత్ శక్తి, డిజిటల్ కనెక్టివిటీ లాంటివి ఉపకరిస్తాయి. అలాగే, అభివృద్ధి చెందని దేశాలతో దౌత్య పరంగా ముందుకు సాగేందుకు... భారత్ కొంతకాలంగా రుణసాయం నమూనా నుంచి పెట్టుబ డుల ఆధారిత భాగస్వామ్యాల వైపు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అదీ కలిసొస్తోంది. అన్ని అంశాలకూ తాజా భేటీ ఒక్కటే సర్వరోగ నివారణి కాకున్నా, చేపల వేటకై శ్రీలంక జలాల్లోకి ప్రవేశిస్తున్న భారతీయ మత్స్యకారులకు ఆ దేశ నౌకాదళం నుంచి ఎదురవుతున్న ఇక్కట్లు, శ్రీలంకలోని తమిళుల ఆకాంక్షల లాంటివి కూడా తాజా భేటీలో ప్రస్తావనకు రావడం సుగుణం. అలాగే, భారత భద్రత, ప్రాంతీయ సుస్థిరత కీలకమని కూడా లంక గుర్తించిందనుకోవాలి. మొత్తం మీద, దిసనాయకె తాజా పర్యటన చిరకాల భారత – శ్రీలంక మైత్రీబంధానికి ప్రతీకగా నిలిచింది. అనేక సంవత్సరాల ఆర్థిక, రాజకీయ సంక్షోభం తర్వాత ద్వీపదేశం పునర్నిర్మాణ బాటలో సాగుతూ, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకోవడంపై శ్రద్ధ పెట్టడం సంతోషకరమే కాక శ్రేయోదాయకం. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కొలంబో పర్యటన జరిపి, ఆ దేశ ఆర్థిక పునరుజ్జీవానికి మనం కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేయడం లాంటివి ఉపకరించాయి. ఫలప్రదమైన చర్చలకు బలమైన పునాది వేశాయి. సమీప సముద్రయాన పొరుగు దేశంగా వాణిజ్యం నుంచి ప్రాంతీయ భద్రతా పరిరక్షణ వరకు అనేక అంశాల్లో వ్యూహాత్మకంగా భారత్‌కు శ్రీలంక కీలకం. అదే సమయంలో విదేశాంగ విధానంలో దిసనాయకె ఆచరణాత్మకదృక్పథమూ అందివచ్చింది. మొత్తం మీద ఆయన తాజా పర్యటన, భారత – శ్రీలంకల మధ్యసంబంధాలు కొంత మెరుగవడం ఇరుపక్షాలకూ మేలు చేసేవే. పరస్పర ప్రయోజనాలను అది కాపాడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు దేశాలకూ కావాల్సింది అదే!

# అమెరికాలో భారతీయం



అమెరికాలో భారతీయుల జనాభా 50 లక్షలు దాటిపోయింది. అమెరికా జనాభాలో ఇది సుమారు ఒకటిన్నర శాతం. చేసే పని పట్ల క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ఈ పెరుగుదలకు కారణమైందని చెప్పవచ్చు. ఈ పరిమాణాత్మకమైన మార్పు గుణాత్మకమైన మార్పుగా పరిణమిస్తుండటం విశేషం. ఉద్యోగ, వ్యాపార రంగాలే కాకుండా అమెరికా ప్రధాన స్రవంతి రాజకీయాల్లోనూ పెరుగుతున్న భారతీయుల ప్రాబల్యమే ఇందుకు నిదర్శనం. ఈ దృష్టితో గమనిస్తే ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికలు చరిత్రాత్మకమైనవే కాదు, భారతీయతకు సంబంధిం చి చాలా రకాలుగా ప్రాముఖ్యం కలవిగా చెప్పుకోవచ్చు. ఈ ఏడాది విడుదలైన 'ఇండియన్ జీనియస్: ది మిటియోరిక్ రైజ్ ఆఫ్ ఇండియన్స్ ఇన్ అమెరికా' వంటి పుస్తకాలు ఈ అభ్యున్నతికి అద్దం పడుతున్నాయి. భారతీయ మూలాలున్న కమలా హ్యారిస్ అత్యున్నత పదవికి పోటీ పడటం, హోరాహోరీగా పోరాడి ఓడిపోవడం ఓ చరిత్ర. మరెందరో భారత సంతతి వ్యక్తుల పేర్లు ఎన్నికలకు ముందు, తర్వాత ప్రముఖంగా ముందుకురావడం విశేషం. మారుతున్న అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని ఇది సూచిస్తున్నది. రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ కొత్త ప్రభుత్వం కోసం జరుపుతున్న నియామకాల్లో భారతీయులకు సింహభాగం దక్కుతుండటం విశేషం. రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వివేక్ రామస్వామి కీలక పదవిలో నియమితులయ్యారు. ప్రభుత్వ నిర్వహణా వ్యయం తగ్గింపు కోసం ఏర్పాటు చేస్తున్న కమిషన్‌లో ఆయన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్‌తో పాటు బాధ్యతలు పంచుకోబోతున్నారు. ఆంతరంగిక భద్రతా సంస్థ ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాశ్ పటేల్ పేరు ట్రంప్ ప్రకటించారు. జయ్ భట్టాచార్య జాతీయ ఆరోగ్య సంస్థల డైరెక్టర్ పదవి దక్కించుకున్నారు. హర్మీత్ ధిల్లోన్ న్యాయశాఖలోని పౌరహక్కుల విభాగం అధిపతి కాబోతున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ సతీమణి భారతీయ సంతతికి చెందిన వ్యక్తి అన్నది తెలిసిందే. అవకాశాలు కలిసి వస్తే ఆమె ప్రథమ మహిళ స్థానాన్నీ ఆక్రమించవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ట్రంప్ ప్రభుత్వంపై భారతీయ ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. భారతీయతతో మాత్రమే కాకుండా భారతదేశంతో ట్రంప్‌కు ప్రత్యేక రాజకీయ అనుబంధం ఉన్నది. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ అసాధారణమైన రీతిలో ట్రంప్‌తో రాజకీయ ర్యాలీ జరిపారు. కానీ, ట్రంప్ ఓటమితో ఆ ప్రయత్నమంతా నిరర్థకమైపోయింది. వ్యక్తిగత స్థాయిలో సాన్నిహిత్యం మాత్రం పెరిగింది.

మొన్న గెలిచిన తర్వాత ట్రంప్ ఆ సంగతి పదే పదే ప్రస్తావించడం గమనార్హం. బుష్ హయాంలో అమెరికా–భారత్ అణు ఒప్పందం కుదరడం వెనుక భారత సంతతి ప్రముఖుల కృషి ఉన్నదని ఇప్పటికీ చెప్పుకొంటారు. ఇప్పుడు అక్కడి భారతీయం పైపైకి ఎగబాకింది. పలుకుబడి మిన్నంటింది. కానీ రెండు దేశాల సంబంధాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. దిగుమతి సుంకాలు, డాలరు మారకం, తదితర అంశాల్లో పొరపొచ్చాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారంలో భారత సంతతి అమెరికన్లు ఏ మాత్రం సహాయకార్ పాత్ర పోషించినా రెండు దేశాల సంబంధాలకు ఎంతో దోహదంచేసినవారవుతారు.

## అమిత్ షా రాజకీయాల నుంచి తప్పుకోవాలి



పాట్నా : పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తాజాగా అమిత్ షా వ్యాఖ్యలపై ఆర్‌జెడి (రాష్ట్రీయ జనతాదళ్) చీఫ్ లాలూ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అమిత్‌షాకు పిచ్చిపట్టింది. ఆయనకు అంబేద్కర్ పట్ల ద్వేషం ఉంది. ఆయన చేసిన పిచ్చి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజ్యాంగ వ్యూహకర్త అంబేద్కర్ చాలా గొప్పవాడు. ఆయనపై అలాంటి వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజకీయాల నుంచి వైదొలగాలి' అని లాలూ యాదవ్ అన్నారు. ఇక బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్ కూడా అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమిత్ షా, ఆయన పార్టీ బిజెపి రాజ్యాంగ వ్యతిరేకం. వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు అని తేజస్వియాదవ్ మండిపడ్డారు. గురువారం బీహార్ శాసనసభ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'బాబాసాహెబ్ అంబేద్కర్ మా ఫ్యాషన్. ప్యాషన్. ఆయన మాకు ప్రేరణ, స్ఫూర్తినిచ్చే వ్యక్తి. అలాంటి వ్యక్తిని మేము అవమానించనివ్వం. ఇలాంటి వ్యక్తులు విద్వేషాన్ని వ్యాప్తి చేసే రాజ్యాంగ వ్యతిరేకులు. అంబ్కేదర్ గురించి పార్లమెంటులో అమిత్‌షా ఉపయోగించిన భాష తీవ్రంగా ఖండించాలి' అని ఆయన అన్నారు.

## దేశవ్యాప్తంగా పెరిగిన చలి తీవ్రత



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలిగాలులు పెరగడంతో పాటు దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర,. దక్షిణాది రాష్ట్రాలను సైతం చలి గాలులు వణికిస్తున్నాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 0 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల నుండి 4 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గినట్లు తెలిపింది. మధ్యప్రదేశ్‌లో సైతం కనిష్ట ఉష్ణోగ్రత 7డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. గ్వాలియర్‌ను దట్టమైన పొగమంచు, చలి చుట్టుముట్టాయి. పొగమంచు కారణంగా విజిబిలిటీ (దృశ్యమాన్యత) పడిపోయిందని ఐఎండి తెలిపింది. మరోవైపు, రాబోయే ఐదు నుండి ఏడు రోజుల్లో వాయువ్య భారత్‌లోని పలు రాష్ట్రాలపై తీవ్ర చలిగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. చలిగాలుల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపైనా పడింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కర్ణాటకలోనూ ఉష్ణోగ్రతలు 5 నుండి 6 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డు కావడం ఇదే మొదటిసారి అని స్థానికులు పేర్కొన్నారు. కర్ణాటకలో 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.

## పార్లమెంటు ఆవరణలో ఉద్రిక్తత..



న్యూఢిల్లీ : పార్లమెంటులో ఆవరణలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. అంబేద్కర్‌ను అవమానించారంటూ పరస్పరం విమర్శలకు దిగాయి. ఇరు పక్షాల నిరసనలతో పార్లమెంటు ప్రాంగణం హెూరెత్తుతోంది. పార్లమెంటు లోపలికి వెళ్తున్న ఎంపిలను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. ఒడిశా ఎంపి ప్రతాప చంద్ర సారంగికి గాయాలయ్యాయి. స్వల్ప గాయాలైన ఆ ఎంపిని సహచర సభ్యులు ఆస్పత్రికి తరలించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నెట్టేశారంటూ అధికార పక్షం ఆరోపించింది. దీంతో పార్లమెంట్ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్లమెంట్ ఉభయ సభలు మధ్యాహ్నం 2.00 గంటలకు వాయిదా పడ్డాయి. అధికార పక్షాల ఆరోపణలపై రాహుల్ గాంధీ స్పందించారు. తాను లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా బిజెపి ఎంపిలు తనను అడ్డుకున్నారని, బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. తనను దూరంగా నెట్టేశారని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కూడా నెట్టేశారని అన్నారు. పార్లమెంటు లోపలికి వెళ్లేందుకు తమకు హక్కు ఉందని, రాజ్యాంగంపై వారు దాడి చేస్తున్నారని అన్నారు. ఇది మొత్తం మీ కెమెరాల్లో రికార్డై ఉంటుందని అన్నారు.

## కోల్‌కతా హైకోర్టుకు బాధితురాలి తల్లిదండ్రులు



కోల్‌కతా : దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసిన కోల్‌కతా అభయ కేసులో తాజా దర్యాప్తు కోరుతూ బాధితురాలి తల్లిదండ్రులు గురువారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. కొనసాగుతున్న దర్యాప్తుపై విశ్వాసం లేదని, తాజా దర్యాప్తుకు దిశానిర్దేశం చేయాలంటూ కోర్టును కోరారు. ఈ కేసును విచారిస్తున్న సిబిఐని పిటిషన్‌లో పార్టీగా చేర్చి, సోమవారం కోర్టు ముందు ఈ విషయాన్ని మరోసారి ప్రస్తావించాలని జస్టిస్ తీర్థాంకర్ న్యాయవాదిని ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆస్పత్రి ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ కేసులో ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ అభిజిత్ మండల్‌కు డిసెంబర్ 13న సీల్దాహ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 90 రోజుల చట్టబద్ధమైన వ్యవధిలో సిబిఐ వారిపై చార్జ్‌షీట్లు దాఖలు చేయడంలో విఫలమైందని వారి తరపు న్యాయవాదులు వాదించడంతో.. కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది.

# కాంగ్రెస్ ఏడాది పాలన ఎటమటమే!



డిసెంబర్ 7తో ఏడాది పూర్తి చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై మీడియా స్పందన ఇప్పుడు చర్చనీయాంశమే. కాంగ్రెస్ పాలన, నిర్ణయాలపై విశ్లేషకులు తమ అభిప్రాయాలను ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తున్నా ఏడాది అనేది ఒక మైలురాయి. అందుకే, తెలంగాణలో గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న వ్యత్యాసాలపై చర్చించుకొనే సమయం ఇది. ఏ కొత్త ప్రభుత్వానికైనా తొలి ఏడాది కీలకమైనది. ఎన్నికల్లో గెలిపించిన ప్రభుత్వం తీసుకొనే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కొత్త ఉత్సాహంలో ఉన్న ప్రభుత్వాలు కూడా ప్రజల్లో ఉన్న అనుకూల ముద్రను కాపాడుకునేందుకు తాపత్రయపడతాయి. డిసెంబర్ తొలి రెండు వారాల్లో చాలా పత్రికలు రేవంత్ ఏడాది పాలనపై ప్రత్యే క కథనాలు ప్రచురించాయి. తాము 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 42 లక్షల గృహిణులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, ఇవి అర్ధ సత్యాలే. రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, రైతుభరోసా లాంటివి సంపూర్ణంగా అమలు కాలేదు. వీటిలో కొన్ని సగం కూడా పూర్తికాకపోగా మరికొ న్ని మొదలే కాలేదు. స్త్రీలకు నెలకు రూ.2,500, వృద్ధాప్య పింఛను రూ.4,000 హామీ ఊసే లేదు. నెలవారీగా ఇచ్చే ఆర్థికసాయం వెంటనే ఇస్తే ఆ హామీకి పరమార్థం ఉంటుంది. రేవంత్‌కు పాలనతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రసన్నంగా ఉంచడమూ కీలకం. 'గాంధీ'ల మనసు మారిందంటే పదవికి మంగళమే. అందుకోసం చిన్న విషయానికీ ఢిల్లీ వెళ్లడం, తెలంగాణలో ఆ తల్లీ కొడుకులకు మర్యాద తగ్గకుండా చూసుకోవడం ఆయనకు అతి ముఖ్యమైనదని ఒక పత్రిక పేర్కొన్నది. 'పాలనను అంచనా వేయడానికి ఒక ఏడాదికాలం తక్కువే అయినా కాంగ్రెస్ హామీల దృష్ట్యా ఇది కీలకమే' అని ది హిందూ అభిప్రాయపడింది. మాజీ సీఎం కేసీఆర్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఎన్నికల్లో నెగ్గిన రేవంత్‌రెడ్డి తానేంటో నిరూపించుకొనే సమయమిదేనని.. ఆర్థిక హామీ లు నెరవేర్చడంలో విఫలమవుతూ, గత ప్రభు త్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందనే నెపంతో కాలహరణ చేయడం తగదని ఈ పత్రిక పేర్కొన్న ది. హామీల పట్ల నిబద్ధత, పాలనాపరమైన విధి విధానాల్లో పారదర్శకత లోపించిందని, రాబో యే నాలుగేండ్లు మరింత కఠినంగా గడుస్తాయని కూడా ఇందులో పేర్కొన్నది. 'రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో ఎన్నికల హామీ ల విషయంలో ప్రధాన ప్రతిపక్షం నుంచి నిరంత ర విమర్శలను ఎదుర్కోక తప్పలేదు' అని హిం దుస్థాన్ టైమ్స్ రాసింది. అయితే, 'బయటినుం చి కాకుండా కాంగ్రెస్ సీనియర్ నేతలతోనే ఆయన కు ప్రమాదం పొంచి ఉన్నది. గతంలో మంత్రులుగా పనిచేసిన వారిని పక్కనబెట్టి ఎన్నడూ మం త్రి పదవి చేపట్టని రేవంత్‌ను ఏకంగా సీఎం కుర్చీపై కూర్చోబెట్టడం అరుదైన సందర్భమే. ఆ కొనసాగింపుపై అధిష్ఠాన దీవెనలు ఆయనకు ముఖ్యం. ఆ వైపు కూడా రేవంత్ ఏ మాత్రం తగ్గని విధేయత ప్రదర్శిస్తున్నారు. తోటి మంత్రులతోనే కాకుండా అధికారులతో కూడా రేవంత్‌కు తగిన సహకారం అవసరం. గత పదేండ్లు కేసీఆర్ నమూనా పాలనలో కొనసాగిన అధికారులు రేవంత్ పట్టాలపై ఎక్కేందుకు సమయం పడుతుంది. ప్రత్యేకంగా ఆర్థిక, ప్రణాళిక శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు రేవంత్ హామీల సాధ్యాసాధ్యాలపై అవగాహన ఉంటుంది. హామీల ప్రాధాన్యతాక్రమంపై వారి సలహాలు అవసరం' అని ఈ పత్రిక పేర్కొన్నది. 'ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం, హామీ అమలు ఏదైనా నిజాయితీగా, విమర్శలు లేకుండా సాగడం లేదు. అసంపూర్ణ రైతు రుణమాఫీ, రైతు భరోసా వాయిదాలు ప్రభుత్వంపై ప్రజల నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి' అని ఒక ప్రముఖ తెలుగు ఛానల్ పేర్కొన్నది. 'పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా చూడటంలో మాత్రం విఫలమయ్యారు. పాత ప్రభుత్వం అమలుచేసిన పథకాల ను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలు చేస్తే ప్రజ లు హర్షిస్తారు గాని, అమల్లో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలుచేసినా ప్రజ లు సంతృప్తి చెందరు' అని ఒక పత్రిక పేర్కొన్నది. 'ఉన్న నిధులన్నింటినీ రైతు రుణమాఫీకి మళ్లించడం వల్ల మరిన్ని పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా ఎన్నో హామీలు నిలిచిపోయా యి. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొన్నది' అని మరో పత్రిక విశ్లేషించింది. 'హైడ్రా ఏర్పాటు రేవంత్ పాలనలో ఓ తొందరపాటు చర్య. చెరువులు, కుంటల పరిరక్షణ అవసరమే. కానీ, ఆ సాకుతో పేదల ఇండ్ల కూల్చివేత మొదలైన నాటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చేతనైతే అన్ని పార్టీల నేతల, ప్రముఖుల ఫాంహౌజ్‌లను ముందు నేలమట్టం చేయాలి. మూసీ ప్రక్షాళన, హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభు త్వం చేసిన తప్పు. లక్ష్యం ఎంత మంచిదైనా దా న్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా పారదర్శకంగా ఉండాలి' అని ఒక పత్రిక సీఎం తప్పొప్పులను అంచనా వేసింది. 'సీఎంగా రేవంత్‌రెడ్డి ముందుగా తన భాషను మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తనను తాను సవరించుకుంటే బాగుంటుంది' అని ఒక పత్రిక సూచించింది. 'సున్నా మార్కులు వచ్చిన విద్యార్థికి సబ్జెక్టు తెలియనట్టే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డికి రాష్ట్ర అవసరాలు తెలియవు. వచ్చిన అవకాశాన్ని వినియోగించకుండా తెలంగాణ అధికారిక చిహ్నాల మార్పునకు తలపడడం మంచిది కాదు. తెలంగాణ తల్లి మార్పును ఒక ఔట్‌సైడర్ దాడిగా భావించక తప్పదు' అని ఓ ఛానల్లో చర్చ జరిగింది. రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో హామీల అమలులో సందిగ్ధత, హైడ్రా లాంటి తొందరపాట్లు, సాటి నేతల పట్ల దురుసు భాష అనే అంశాలు అన్ని వేదికలపై ప్రస్తావించబడ్డాయి. ఈ విషయాలపై ప్రభుత్వం సమీక్షించుకొని, సవరించుకుంటే ఓట్లేసిన ప్రజలు హర్షిస్తారు.

# 'ఒకే దేశం - ఒకే విధానం'




పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తికి సమాధి కట్టే వివాదాస్పద జమిలి ఎన్నికల కోసం బీజేపీ ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రతిపాదించింది. ఈ బిల్లులను ప్రవేశ పెట్టాలా? లేదా అన్న విషయమై ఓటింగ్ జరిగినప్పుడు మొత్తం 461 మంది సభలో ఉన్నారు. అందులో 269 మంది అధికార పక్షానికి అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అప్పుడు సభలో ఉన్న వారి సంఖ్యాబలాన్ని బట్టి చూసినా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'ల బిల్లును ఆమోదింప చేసు కోవడానికి రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు ఎన్డీయే సర్కారుకు లేదని స్పష్టమైంది. ప్రజెం టేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తామని కేంద్ర ప్రభుత్వం సభకు హామీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. జమిలి ఎన్నికల వల్ల వ్యయం భారీగా తగ్గి ప్రభుత్వ ఖజానాకు లబ్ది చేకూరుతుందనేది మోడీ సర్కార్ వాదన. కానీ అసలు కుట్ర వేరే ఉంది. వీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'ఒంటెత్తు పోకడే'! 'ఒకే దేశం - ఒకే విధానం' అంటూ దేశాన్ని క్రమక్రమంగా కేంద్రీకృతం వైపు లాక్కెళ్లుతున్న సంగతి తెలిసిందే. భౌగోళికంగానూ, ప్రజల జీవన విధానంలోనూ అడుగడుగునా భిన్నత్వంతో తొణికిసలాడుతూ ఏకత్వాన్నిచాటే దేశం మనది. సంఘ్ పరి వార్‌కు మొదటి నుంచి కంటగింపు కలిగి స్తున్నదీ ఇదే. అందుకనే దేశంలో ఈ భిన్నత్వ వైశిష్టాన్ని దెబ్బతీసే కుట్రలు సాగుతున్నాయి. సువిశాల భూభాగంలో 140కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో ప్రతి విషయంలోనూ ఒకే విధానాన్ని అనుసరిస్తూ పోతే అది ప్రభుత్వ పాలనాధికారాలు కేంద్రీ కృతం కావడానికి దోహదం చేస్తుందే తప్ప, రాష్ట్రాల పురోగతికి కానీ, ప్రజల సంక్షేమానికి కానీ అది ఏ కోశానా తోడ్పడదు. ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలన దిశగా తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం. మూడు నాలుగు రాష్ట్రాలలో కూడా ఒకే విడత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్‌కు తలకుమించిన భారం అయిపోతోంది. ఒకే రాష్ట్రంలో సైతం మూడునాలుగు విడతలుగా ఎన్నికలు నిర్వహించిన సందర్భాలు అనేకం. అలాంటిది దేశమంతా ఒకేసారి ఎన్నికలు ఎలా సాధ్యం? ఈ రాజ్యాంగ సవరణ బిల్లులు అంతిమంగా గట్టెక్కుతాయో లేదా అన్న విషయం పక్కన పెడితే.. బిల్లు ప్రతిపాదన దశలోనే ప్రతి పక్షాలు చాలా తీవ్రంగా ప్రతి ఘటిం చాయి. ఇండియా కూటమిలోని అన్ని పక్షాలు ముక్త కంఠంతో బిల్లు ప్రతి పాదనను అడ్డుకోవడానికి సర్వ శక్తులూ ఒడ్డాయి. ఒకే దేశం- ఒకే ఎన్నికల ప్రతిపాదనను బేరీజు వేయ డానికి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికలోనే అనేక లోపాలున్నాయి. ఈ కమిటీ ఏడు దేశాలలో పరిస్థితిని అంచనా వేసినట్టు చెబుతున్నది. కానీ వాటిలో ఒక్క దేశం విస్తీర్ణం మన దేశంలోని ఏ రాష్ట్రం కన్నా పెద్దది కానే కాదు. పదిహేడు వందల పేజీలకు పైగా ఉన్న కోవింద్ కమిటీ నివేది కను ఆరు నెలల్లో తయారు చేశారనడం ఒట్టి 'జుమ్లా'. ఎప్పుడో తయారు చేసి పెట్టుకున్న దస్త్రాలకు ఈ కమిటీతో ఆమోదముద్ర వేయించారని పిస్తోంది. ఒకే భాష, ఒకే కట్టుబొట్టు, ఒకే తిండి, ఒకే విద్య ఇలా దేశమంతా ఒకే విధానం ఉండాలని సంఘ్ పరివార్ పేరాశ. ఈ కోవలో జమిలి ఎన్నికలు కూడా రుద్దాలనే దాని ఉబలాటం. ప్రజల సంపదను లూటీ చేసి కార్పొరేట్ కంపెనీలు కుమ్మరిస్తున్న కోట్లాది రూపాయల సొమ్ముతో 'ఆపరేషన్ కమల్' చేపట్టి, రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చివేస్తూ ఇప్పటికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తోంది. ఇక దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అది పార్లమెంటరీ వ్యవస్థకు పెను విఘా తంగా మారుతుంది. సమాఖ్య స్ఫూర్తినే ప్రమాదంలోకి నెట్టే స్తుంది. జమిలి ఎన్నికలు జరపాలంటే దేశంలోని అన్ని శాసన సభలనూ ఒకేసారి రద్దు చేయాలి. లేదా కొన్ని శాసనసభలను ముందస్తు ఎన్నికలకు ఒప్పించాలి. మరికొన్నింటికి పదవీకాలం పొడి గించాలి. ఇంత కసరత్తు చేస్తే తప్ప 'జమిలి' సాధ్యపడదు. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం చాలా స్పష్టంగా నిర్దేశిస్తోంది. ఒకవేళ బీజేపీ కోరుకున్నట్టు జమిలి జరిగితే రాష్ట్రాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. దేశవ్యాప్త ప్రచారాల్లో ప్రాంతాలవారీ సమస్యలు కొట్టుకుపోతాయి. ప్రాంతీయ పార్టీలు ఉనికి కోల్పోయి కనుమరుగయ్యే ప్రమా దముంది. సరిహద్దు ఘర్షణలనో, మైనార్టీలనో బూచిగా చూపెట్టి ప్రజలను మతాల పరంగా, ప్రాంతాల పరంగా చీలి కలు పేలికలు చేసి ప్రజా సమస్యలను తొక్కిపెట్టేస్తారు. మణి పూర్ మారణహెూమం, అదానీ వ్యవహారం, రూపాయి అంత కంతకూ దిగజారిపోవడం, వడ్డీరేట్లు, ధరాఘాతం, రైతుల నిర సనలు, నిరుద్యోగం మరింతగా పెరగడం, వాటిని పరిష్కరించే చేవలేకనే బీజేపీ నేడు ఆడుతున్న నాటకాలివి. ఇవి దేశానికే కాదు, ప్రజలకు, ప్రజా ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరం.

# 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ నయా-ఉదారవాద విధానాలు




ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శుక్రవారం ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ నయా-ఉదారవాద విధానాలు మరింత శీఘ్రగతి అమలుకు రోడ్ మ్యాప్. కార్పొరేట్ల అడ్డూఅదుపు లేని దోపిడీకి ఎర్ర తివాచీ. వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 'విజన్-2047'లో భాగంగా రాష్ట్రంలోనూ తీసుకొచ్చామని చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించారు. కేంద్రంలో బిజెపి ప్రతిపాదించిన విజన్‌లో అణువణువూ మతతత్వ-కార్పొరేట్ జమిలి విధానాల కలబోత కాగా అందులో భాగమే తమ 'కల' అంటున్నారు చంద్రబాబు. ప్రజలందరికీ సంపద, ఆరోగ్యం, సంతోషం అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. పేదరికం లేని సమాజం, ఉపాధి- ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇత్యాది పది సూత్రాలు తమ విజన్‌కు ప్రాతిపదికగా పేర్కొన్నారు. 2047 నాటికి అందరికీ అక్షరాస్యత, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 42 వేల డాలర్ల తలసరి ఆదాయం, 60 శాతానికి పట్టణ జనాభా, రెండు శాతానికి నిరుద్యోగిత రేటు తగ్గింపు, 85 సంవత్సరాల సగటు ఆయు ప్రమాణం, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యాలుగా ప్రకటించారు. ఈ 'కలలు' ఆకర్షణీయంగానే కనిపిస్తున్నప్పటికీ వాటి సాధనకు ఎంచుకున్న విధానాలే సదరు కలలను కల్లలు చేస్తాయి. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పి-4 విధానాన్ని తారకమంత్రంగా జపిస్తోంది. ఇప్పటి వరకు మూడు 'పి' లు పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) వాడుకలో ఉంది. కొత్తగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపిపి) నాలుగు 'పి' ల ఫార్ములా తెర మీదికి తెచ్చారు. అందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ విడుదల వేదికపై నుంచి ఎక్కడ పరిశ్రమ వస్తే అక్కడి రైతులు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చినట్లున్నారు. దానర్థం కార్పొరేట్లు పరిశ్రమలు, ప్రాజెక్టులు పెడతారు. అందుకు కావాల్సిన భూములను రైతులు త్యజించాలన్నమాట. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర పి-4 సిద్ధాంతం వెనుక దాగుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోనిటైజేషన్ పైప్‌లైన్ అంది. అడవులను, నదులను, సముద్రాలను, చివరికి జాతీయ రహదారుల, రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను సైతం కార్పొరేట్లకు అప్పగిస్తోంది. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ అందుకు భిన్నమైంది కాదు. ఆర్థిక హబ్‌లు, హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్, రెండు మెగా పోర్టులు, రీసైక్లింగ్ క్లస్టర్, నౌకా నిర్మాణం, టూరిజం ప్రాజెక్టులు, ఎ.ఐ, డ్రోన్లు.. ఇవన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల ప్రాపకం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాస్తా స్పీడ్ ఆఫ్ బిజినెస్‌గా మారిందీ అందుకే. ఇప్పటికే జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చింది. పోర్టులు, విద్యుత్, సకలం అదానీకి సమర్పించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్న కూటమి తాను కూడా అదే బాటలో పయనిస్తోందనడానికి సెకితో సౌర విద్యుత్ ఒప్పందం కొనసాగింపే ఉదాహరణ. చంద్రబాబు విజన్లు కొత్తవేమీ కావు. 1999 ప్రాంతంలో బ్రిటీష్ మెకెన్సీ కన్సల్టెన్సీ రూపొందించిన 'విజన్ 2020'తో ఊదరగొట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 'విజన్ 2029' అన్నారు. ఇప్పుడేమో ఏకంగా రాబోయే 23 ఏళ్లకు 'విజన్-2047' అంటున్నారు. విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా విజన్లు అనడం ప్రజలను మభ్యపెట్టడానికే. వ్యవసాయ రాష్ట్రమైన ఎ.పి.లో వ్యవసాయం సంక్షోభంలో ఉంది. రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల బతుకులు ఆందోళనకరంగా తయారయ్యాయి. వారి ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర రైతుల్లో 93 శాతం మంది రుణగ్రస్తులు. సగటు అప్పు రూ.2.45 లక్షలు. ఈ రెండు అంశాల్లో దేశంలో మనమే టాప్. తలసరి ఆదాయంలో 15వ స్థానంలో ఉన్నాం. నిరుద్యోగం, విద్య, వైద్యం, మహిళా, శిశు మరణాలు, వారి సంక్షేమం, ఈ రంగాలన్నీ కునారిల్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రహదార్లు మట్టి రోడ్లు. గుంతలు లేని తారురోడ్లను లక్ష్యంగా ఎంచుకున్న దుస్థితి. విజన్ అనేది నేల విడిచి సాము చేయకూడదు. విస్తృత స్థాయి చర్చలతో రూపొందాలి. ప్రజల మధ్య అసమానతలు రూపుమాపేది అసలైన దార్శనికత.





# స్పోర్ట్స్ న్యూస్

## లుక్ బ్యాక్ స్పోర్ట్స్..
## 24లో రిటైరైన 28 మంది అంతర్జాతీయ క్రికెటర్లు

ఏ ఆటగాడికైనా.. ఎంతటి ఆటగాడికైనా.. ఏదో ఒక దశలో రిటైర్మెంట్ తప్పదు.. ఇది వారి క్రీడా జీవితంలో భాగం అనే అనుకోవాలి. అయితే, యాక్సిడెంటల్ గానో మరే విధంగానో ఒకే ఏడాది భారీగా రిటైర్మెంట్లు ఉండడం మాత్రం ఆశ్చర్యకరమే.. అది కూడా ఈ ఏడాదే కావడం మరింత అనూహ్యం. పైగా క్రికెట్ లో కావడం గమనార్హం.

**అశ్విన్ తో ఆఖరా.. రోహిత్ కూడానా?**

టీమ్ ఇండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రస్తుతం ఆస్ట్రేలియా టూర్ లో ఉండగానే రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. బహుశా ఈ ఏడాదిలో చివరగా రిటైర్ అవుతున్న అంతర్జాతీయ క్రికెటర్ ఇతడేనేమో? వాస్తవానికి ఈ సిరీస్ లో తీవ్రంగా విఫలం అవుతున్న కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని భావించారు. అలాకాకుండా అశ్విన్ రిటైర్మెంట్ ఇచ్చాడు. ఇక రోహిత్ తో పాటు స్టార్ బ్యాట్స్ మన్ విరాట్ కోహ్లి ఈ ఏడాది టి20 ప్రపంచ కప్ విజయం అనంతరం రిటైర్ అయిన సంగతి తెలిసిందే. మరో అంతర్జాతీయ క్రికెటర్ ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా ఈ ఏడాదే తప్పుకొన్నాడు.రవీంద్ర జడేజా (టి20లు) వంటి మ్యాచ్ విన్నర్ తో పాటు వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ దినేశ్ కార్తీక్, వృద్ధిమాన్ సాహా, కేదార్ జాదవ్, సౌరభ్ తివారీ, వరుణ్ అరోన్, బరీందర్ శరణ్, సిద్ధార్థ్ కౌల్ ఈ ఏడాది రిటైరైన భారత క్రికెటర్లు. జడేజా మాత్రం టెస్టులు, వన్డేలు ఆడుతున్నాడు.

**విదేశీయులూ అధికమే..**

హెన్రిచ్ క్లాసెన్ (టెస్టులు) వంటి విధ్వంసక బ్యాట్స్ మన్ తో పాటు ఐపీఎల్ ద్వారా మనకు ఎంతో దగ్గరైన డేవిడ్ వార్నర్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్, న్యూజిలాండ్ కు చెందిన మేటి పేసర్ టిమ్ సౌథీ, నీల్ వాగ్నర్, కొలిన్ మన్రో క్రికెట్ నుంచి తప్పుకొన్నారు.

**పేస్ దిగ్గజం పరుగు ఆపాడు**

ఓ పేసర్ కు టెస్టుల్లో 500 వికెట్లు తీయడమే కష్టం అనుకుంటే 704 వికెట్లు పడగొట్టాడు జేమ్స్ అండర్సన్. దాదాపు 22 ఏళ్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అతడు 42 ఏళ్ల వయసులో రిటైరయ్యాడు. అంతేకాదు.. తొలిసారిగా ఐపీఎల్ లోనూ వేలానికి రిజిస్టర్ చేసుకున్నాడు. కానీ, మెగా వేలంలో ఎవరూ కొనలేదు. ఇంగ్లండ్ కే చెందిన టాప్ ఆర్డర్ బ్యాట్స్ మన్ డేవిడ్ మలాన్, స్పిన్ ఆల్ రౌండర్ మోయిన్ అలీ కూడా 2024లోనే విరమించారు.

**27 ఏళ్లకే..**

ప్రతిభావంతుడైన బ్యాట్స్ మన్ గా పేరుతెచ్చుకున్నా.. బంతిని తలకు పలుసార్లు తగిలించుకుని.. సిరీస్ ల మధ్యలోనే తప్పుకొనే అలవాటున్న ఆస్ట్రేలియన్ విల్ పకోవ్ స్కీతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ మాథ్యూ వేడ్, పాకిస్థాన్ కు చెంది మొహమ్మద్ ఆమిర్, ఇమాద్ వాసీం కూడా 2024లోనే ఆట ముగించారు.

**ఎంపీ అయి.. రాజకీయంలో చిక్కుకుని..**

బంగ్లాదేశ్ కు చెందిన మేటి ఆల్ రౌండర్ షకిబ్ ఉల్ హసన్ కెరీర్ ఈ ఏడాదే ముగిసింది. టెస్టులు, టి20ల నుంచి తప్పుకొన్న షకిబ్.. ఈ ఏడాదే అవామీ లీగ్ పార్టీ తరఫున ఎంపీ అయ్యాడు. కానీ, షేక్ హసీనా ప్రభుత్వం ప్రతనంతో ఇబ్బందుల్లో పడ్డాడు. ఓ దశలో స్వదేశానికి రాలేని పరిస్థితి. సొంతగడ్డపై చివరి మ్యాచ్ ఆడాలన్న కోరిక కూడా తీరలేదు. ఇతడితో పాటు బంగ్లాకు ఆల్ రౌండర్ గా సేవలందించిన మొహ్మదుల్లా కూడా టి20 కెరీర్ చాలించాడు.

## అశ్విన్ బాటలో ఆ ముగ్గురు..
## టీమిండియా లెజెండ్స్ రిటైర్ కాబోతున్నారా?



భారత సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశారు. భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించిన ఈ మేటి బౌలర్ ఇకపై టెస్ట్ జట్టులో భాగంగా ఉండరని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత జట్టులో అనేక మంది ఆటగాళ్లు తమ కెరీర్ ముగింపు దశలో ఉన్నందున, బోర్డర్-గావాస్కర్ ట్రోఫీ ముగిసిన తర్వాత మరికొంత మంది ఆటగాళ్లు టెస్టుల నుండి రిటైర్ కావడం ఆశ్చర్యంగా లేదు. ఈ నేపథ్యంలో, సిరీస్‌లో చివరి టెస్ట్‌కి జట్టు సిద్ధమవుతుండగా, రిటైర్ అయ్యే అవకాశం ఉన్న ముగ్గురు ఆటగాళ్లు వీరంటూ సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తోంది. వారెవరో ఇప్పుడు తెలుసుకుందాం.

విరాట్ కోహ్లి

విరాట్ కోహ్లి టెస్టుల నుండి రిటైర్మెంట్ ఎందుకు తీసుకుంటారు? విరాట్ కోహ్లి భారత అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా ప్రసిద్ధి చెందారు. టెస్టుల్లో భారత జట్టును ముందుండి నడిపిస్తూ ఎన్నో చారిత్రాత్మక విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అయితే, 2020 నుండి టెస్టుల్లో కోహ్లి బ్యాటింగ్ సగటు 31కి కిందగా ఉండటం ఆయన ప్రతిభకు తగినది కాదనే చెప్పవచ్చు. ఈసారి బోర్డర్-గావాస్కర్ ట్రోఫీ కూడా కోహ్లి జ్ఞాపకంగా ఉంచుకునే విధంగా లేదు, పర్త్ టెస్టులో చేసిన సెంచరీ మినహా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. తన దారుణమైన ఫామ్, వయసు దృష్ట్యా కోహ్లి టెస్టుల నుండి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని సోసల్ మీడియాలో ఒకరకమైన బజ్ క్రియేట్ అయింది.

రోహిత్ శర్మ

రోహిత్ శర్మ టెస్టుల నుండి రిటైర్మెంట్ ఎందుకు తీసుకుంటారు? ఈ సంవత్సరం టెస్టు క్రికెట్లో రోహిత్ శర్మ ప్రయాణం బాగా ఒడిదుడుకుల మధ్య సాగింది. ఇంగ్లాండ్‌లో సొంతగడ్డపై మెరుగైన ప్రదర్శన చేసిన రోహిత్, తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. గత పదిమంది టెస్టు ఇన్నింగ్స్‌లలో రోహిత్ సగటు 12కి పైగా మాత్రమే ఉండటం గమనార్హం, అంతేకాకుండా ఒకే ఒక్క అరవై పరుగుల ఇన్నింగ్స్ ఉంది. 37 ఏళ్ల వయసులో ఉన్న రోహిత్, బోర్డర్-గావాస్కర్ ట్రోఫీ ముగిసిన తరువాత టెస్టులకు గుడ్‌బై చెప్పడం సముచితంగా భావించే అవకాశం ఉంది.

మొహమ్మద్ షమీ

మొహమ్మద్ షమీ టెస్టుల నుండి రిటైర్మెంట్ ఎందుకు తీసుకుంటారు? భారత జట్టు అత్యుత్తమ బౌలర్లలో ఒకరైన మొహమ్మద్ షమీ టెస్టుల్లో ఎన్నో విజయాలను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లలో తన ప్రభావాన్ని చూపించారు. అయితే, 2023 హోం వరల్డ్‌కప్ తర్వాత షమీ ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. ఆయన ఫిట్‌నెస్ సమస్యలు, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యువ బౌలర్ల కెరియర్ దృష్ట్యా, షమీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశముంది.

## అశ్విన్ రిటైర్మెంట్ సరే..
## అతడిని భర్తీ చేసే వారసుడు ఎవరు..?

15 ఏళ్ల కెరీర్.. 106 టెస్టులు.. 500 పైగా వికెట్లు.. అన్నిటికీ మించి తెలివైన క్రికెటర్.. బ్యాటింగ్ లోనూ రాణిస్తూ తన ప్రత్యేకత చాటాడు.. ఆరు సెంచరీల సాయంతో టెస్టుల్లో 3,503 పరుగులు, వన్డేల్లో 707 పరుగులు.. ఇవీ టీమ్ ఇండియా ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఘనతలు. మొన్నటికి మొన్న బంగ్లాదేశ్ తో సిరీస్ లో బ్యాటింగ్ కుప్పకూలగా అశ్విన్ సెంచరీతో జట్టును నిలబెట్టాడు. అలాంటి ఆల్ రౌండర్ ఇప్పుడు రిటైరయ్యాడు. ఆస్ట్రేలియాతో గులాబీ (రెండో) టెస్టులో ఆడిన అతడు.. మూడో టెస్టుకు జట్టులో లేడు. అయితే, ఉన్నట్లుండి రిటైర్మెంట్ ప్రకటించి.. భారత్ కు వచ్చేస్తున్నాడు.. ఇకమీదట ఎవరిదో భారం..? 2010 నుంచి అశ్విన్ భారత టెస్టు జట్టులో రెగ్యులర్ సభ్యుడు. 106 టెస్టులు ఆడిన అతడు.. కష్ట కాలంలో ఎలాంటి బంతులు వేయాలో తెలిసినవాడు. ముఖ్యంగా స్వదేశంలో అశ్విన్ ను ఎదుర్కొనడం ఎంతటి జట్టుకైనా కష్టమే. మరిప్పుడు అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరు..? అంతేకాదు.. మరో స్పిన్నర్ రవీంద్ర జడేజా కూడా కెరీర్ చరమాంకానికి వచ్చేశాడు. అతడు ఇప్పటికే టి20ల నుంచి తప్పుకొన్నాడు. వన్డేలకు సెలక్ట్ చేయడం కష్టమే అన్నట్లుంది. %ూశ్రీంశీ =ఝఎ% - కంగారూ గడ్డపై ఒకే ఒక్క భారతీయుడు.. కపిల్ దేవ్ తర్వాత ఇతడే వారసుడు అతడేనా? అశ్విన్ వారసత్వం అందుకోవడం మామూలు మాటలు కాదు. అటు బ్యాట్ తోనూ రాణించగలిగితేనే అతడి స్థానాన్ని భర్తీ చేయగలరు. ఈ విషయంలో సత్తా ఉన్నవాడిగా కనిపిస్తున్నాడు కుర్రాడు వాషింగ్టన్ సుందర్. ఇప్పటికే టి20లు, వన్డేల్లో తన సత్తా నిరూపించుకున్న సుందర్.. అశ్విన్ సొంత రాష్ట్రం తమిళనాడుకు చెందినవాడు. 17 ఏళ్ల వయసుకే టీమ్ ఇండియాలో సభ్యుడైన సుందర్ కొన్ని కారణాల వల్ల రెగ్యులర్ సభ్యుడు కాలేదు. అయితే, అశ్విన్ లానే ఆఫ్ స్పిన్నర్ కావడంతో ఇప్పుడు సుందర్ ను రెగ్యులర్ గా తీసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి ప్రస్తుతం ఆస్ట్రేలియా టూర్ కు సుందర్ ను కూడా తీసుకెళ్లారు. తొలి టెస్టులో అశ్విన్ స్థానంలో అతడినే ఆడించారు కూడా. సుందర్ ను పక్కనపెట్టి రెండో టెస్టులో అశ్విన్ ను ఆడించారు. వీరిద్దరినీ కాదని మూడో టెస్టులో జడేజాను తీసుకున్నారు. సుందర్ ఇక రెగ్యులర్ ఎడమ చేతి వాటం బ్యాట్స్ మెన్ ను కట్టడి చేసేందుకు జట్టులో ఆఫ్ స్పిన్నర్ ఉండాలి. మరీ ముఖ్యంగా ఆస్ట్రేలియా వంటి జట్టుపై. అందుకని సుందర్ ను రెగ్యులర్ గా ఆడించే చాన్సుంది. ఇతడికంటే ప్రస్తుతం మెరుగైన ఆఫ్ స్పిన్నర్ దేశంలో ఎవరూ లేరు. అందుకని సుందర్ కు మంచి భవిష్యత్ ఉందని చెప్పొచ్చు.



## అందరు రూట్ క్లియర్ చేయాల్సిందేనట..! నెక్స్ట్ రిటైర్ అయ్యేది వాళ్లేనా..?



బుధవారం బ్రిస్బేన్ టెస్టు 5వ రోజు మధ్యలో భారత ఆఫ్-స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. భారత కెప్టెన్ విరాట్ కోహ్లితో అశ్విన్ తీసుకున్న ఆత్మీయ హగ్ ఈ వార్తను ముందుగా బయట పెట్టింది. అశ్విన్ తీసుకున్న నిర్ణయం అందరికీ షాక్‌గా మారినప్పటికీ, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్ష భోగ్లే చేసిన పోస్ట్ ఈ నిర్ణయం జట్టులోని ఇతర సీనియర్లకు సందేశాన్ని ఇచ్చిందని సూచించింది. రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, విరాట్ కోహ్లి వంటి ఆటగాళ్లు ప్రస్తుతం 30 ఏళ్ల వయస్సును దాటిపోయారు. వీరు ఇంకా మంచి ప్రదర్శన చేయగలిగే స్థాయిలో ఉన్నప్పటికీ, అశ్విన్ కూడా అదే స్థాయిలో ఉన్నాడు అన్న వాదన తెరపైకి వచ్చింది..గతంలో అశ్విన్‌ను అన్ని ఫార్మాట్లలో ఇతర స్పిన్నర్లతో పోలిస్తే వెనక్కి నెట్టడం జరిగింది, కానీ ఎప్పుడూ ఒక ఆఫ్-స్పిన్నర్ ముందు ప్రాధాన్యం పొందలేదు. అయితే, వాషింగ్టన్ సుందర్‌ను పెర్త్ టెస్టులో ఎంపిక చేయడం ద్వారా, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యం అశ్విన్‌కు స్పష్టమైన సందేశం పంపింది, దాంతో అశ్విన్ తన స్థానంలో ఉన్న మరెవరైనా తీసుకునే నిర్ణయమే తీసుకున్నాడు. హర్ష భోగ్లే తన “%శ%” పోస్ట్‌లో, అశ్విన్‌కు రిటైర్మెంట్ ఇచ్చేందుకు అనుమతించడం ద్వారా, సెలెక్టర్లు ఇతర సీనియర్లకు బార్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. “అశ్విన్‌కు రిటైర్మెంట్ అవకాశం ఇచ్చి, అతను ఎంపిక అయితే ఆడేవాడు, సెలెక్టర్ల నిర్ణయం జట్టులోని అందరికీ సందేశం పంపింది. ముందున్న కాలం ఆసక్తికరంగా ఉండబోతోంది,” అని హర్ష వ్యాఖ్యానించారు. మ్యాచ్ తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు కూర్చున్న అశ్విన్, తన వద్ద ఇంకా క్రికెట్ ఆడే శక్తి ఉన్నప్పటికీ, దాన్ని క్లబ్ స్థాయిలో ఉపయోగించాలని కోరుకుంటున్నానని చెప్పారు. “ఇది నా అంతర్జాతీయ క్రికెట్ జీవితంలో చివరి రోజు. నేను ఇంకా కొంత కాలం పాటు క్రికెట్ ఆడగలను.. దాన్ని క్లబ్ క్రికెట్‌లో ప్రదర్శించాలని అనుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నాకు చాలా ఆనందం దక్కింది,” అని అశ్విన్ భావోద్వేగంగా పేర్కొన్నారు.



# బ్లాక్ శారీలో శ్రీవల్లి స్టన్నింగ్ షో!

హీరోయిన్ రష్మిక మందన్న.. పుష్ప సినిమాతో ఎలాంటి క్రేజ్ సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. ఆ మూవీతో పాన్ ఇండియా లెవెల్ లో ఫ్యాన్ బేస్ దక్కించుకున్న అమ్మడు.. నేషనల్ క్రష్ గా మారిపోయింది. అందరి దృష్టిని తన అప్ కమింగ్ చిత్రాల వైపు తిప్పుకుంటూనే ఇప్పుడు చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నారు. రీసెంట్ గా పుష్ప సీక్వెల్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి శ్రీవల్లి రోల్ లో తనదైన శైలిలో మెప్పించారు. డ్యాన్స్, యాక్టింగ్, ఎక్స్‌ప్రెషన్స్.. అలా ప్రతి విషయంలో కూడా అదరగొట్టేస్తూ.. తన ఖాతాలో మరో బ్లాక్ బస్టర్ హిట్ ను వేసుకుంది. పుష్ప 2: ది రూల్ కు గాను ఎందరో విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు పుష్ప-2 సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న రష్మిక అదే సమయంలో తన కొత్త చిత్రాలు పూర్తి చేస్తున్నారు. రీసెంట్ గా ఆమె యాక్ట్ చేస్తున్న గర్ల్ ఫ్రెండ్ మూవీ టీజర్ రిలీజ్ అయింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా విభిన్నమైన లవ్ స్టోరీతో లేడీ ఓరియెంటెడ్ చిత్రంగా తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. గర్ల్ ఫ్రెండ్ తో పాటు సల్మాన్ ఖాన్ తో సికిందర్, శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న కుబేరలో యాక్ట్ చేస్తున్నారు. హారర్ కామెడీ మూవీ థామాలో, రెయిన్ బోలో కూడా భాగమయ్యారు. ఇప్పటికే నటించిన చావా రిలీజ్ కు రెడీ ఉంది. అలా క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. అయితే కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటారు రష్మిక. తరచూ కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటారు. అటు మోడ్రన్.. ఇటు ట్రెడిషనల్ గా సందడి చేస్తూనే.. తన ఫాలోవర్స్ ను వేరే లెవెల్ లో పెంచేసుకుంటోంది.పోస్ట్ చేసింది. తాను చాలా కష్టపడి మంచి పొజిషన్ కు వచ్చానని తాజాగా హీరోయిన్ మూమెంట్ అంటూ బ్లాక్ శారీలో దిగిన పిక్స్ ను చెనుతూ అందంగా స్టిల్స్ ఇచ్చింది. అయితే ప్లెయిన్ శారీలో రష్మిక అదిరిపోయారని.. బ్యాక్ పోజ్ తో మైమరిపించారని నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ప్రస్తుతం ఆమె పిక్స్ వైరల్ గా మారగా.. శ్రీవల్లి రాబోయే రోజుల్లో మరిన్ని హిట్స్ అందుకోవడం గ్యారెంటీ అని అంటున్నారు.



# ఏ మాయ చేసావే సంయుక్తా..!





సంయుక్త మీనన్ ఫ్యాషన్ ప్రపంచంలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయక వస్త్రధారణ అయినా, నేటి జెన్ జెడ్ తరహాలో అల్ట్రా మోడ్రన్ లుక్ అయినా సంయుక్త అందచందాలు ఒక కవ్వింపు. నటిగా, స్టైల్ ఐకాన్‌గా తన బహుముఖ ప్రజ్ఞతో ఆకట్టుకుంటోంది.ఈ మలయాళీ బ్యూటీ ఇప్పటికే తెలుగు చిత్రసీమలో చెరగని ముద్ర వేసింది. విలక్షణ కళాకారిణిగా తనదైన నటప్రదర్శనతో భారీ ఫాలోయింగ్ ని సంపాదించుకుంది. మరోవైపు సోషల్ మీడియాల్లో ఫోటోషూట్లతోను అభిమానులకు చేరువవుతోంది. తాజాగా సంయుక్త షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ఈ బ్యూటీ తెలుగింటి సీతలా చీరలో అందంగా కనిపించింది. ఎరుపు వంగపువ్వు రంగు మిశ్రమంతో రూపొందించిన ఈ డిజైనర్ శారీ జరీ అంచుతో తళతళలాడుతోంది. ఇక కాంబినేషన్ బ్లౌజ్ మోడ్రన్ అప్పీల్ తో మైమరిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వేగంగా దూసుకెళుతోంది. సంయుక్త చీరలో ఎంతో అందంగా కనిపిస్తోందని, తెలుగింటి సాంప్రదాయం ఉట్టిపడుతోందని నెటిజనులు ప్రశంసిస్తున్నారు. ఆ కళ్లలో మెరుపు.. నాటీ హొయలు మతి చెడగొడుతున్నాయి! అంటూ యూత్ వ్యాఖ్యానిస్తున్నారు. ఓవరాల్ గా సంయుక్త శారీ లుక్ తో స్టన్నర్ గా మారింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. సంయుక్త ఇటీవల %-%డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్%-% చిత్రంలో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి ప్రదర్శన ఇవ్వనప్పటికీ, తన నటనా నైపుణ్యంతో మైమరిపించింది. టాలీవుడ్ లో ప్రతిభావంతులైన నిఖిల్, శర్వానంద్, రానా వంటి స్టార్లతో ప్రస్తుతం సినిమాపుణ్యంతో మైమరిపించింది. టాలీవుడ్ లో ప్రతిభావంతులైన నిఖిల్, లు చేస్తోంది. నిఖిల్ సరసన స్వయంభు అనే చిత్రంలో సంయుక్త నటిస్తోంది. మరోవైపు మలయాళం, హిందీ చిత్రాలలోను సంయుక్త నటిస్తోంది. కానీ తనకు మంచి అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తున్న తెలుగు చిత్రసీమకు తొలి ప్రాధాన్యతనిస్తోంది.

# ఎల్లో చీరలో చూపు తిప్పనివ్వని ప్రగ్యా


కంచె సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్‌కు జోడీగా ఆ సినిమాలో నటించిన ప్రగ్యా జైస్వాల్ అందంతో పాటు అభినయంతో అలరించింది. ఆ సినిమా తర్వాత ప్రగ్యా జైస్వాల్ టాలీవుడ్‌లో బిజీ కావడం కన్ఫర్మ్ అని అంతా అనుకున్నారు. కానీ అదృష్టం కలిసి రాలేదు. గత పదేళ్లుగా ఈ అమ్మడు అడపా దడపా సినిమాలతోనే కెరీర్‌ను నెట్టుకు వస్తుంది. హిట్ పడ్డా కెరీర్ మలుపు తిరగడం లేదు. స్పీడ్ అందుకోకుండా మెల్లగా ఈ అమ్మడి సినీ కెరీర్ సాగుతూనే ఉంది. దశాబ్ద కాలంగా పెద్దగా ఆఫర్లు లేకున్నా ఇండస్ట్రీలో కొనసాగుతుంది అంటే కారణం ఆమె అందం అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ప్రగ్యా రెగ్యులర్‌గా తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. తాజాగా మరోసారి ఎల్లో చీర కట్టు ఫోటోలతో మెరిసింది. అందమైన ప్రగ్యా చీర కట్టులో మరింత అందంగా ఉంటుంది అనే విషయం గతంలోనే వెల్లడి అయింది. ఇప్పుడు ఆ విషయం మరోసారి నిరూపితం అయ్యింది అంటూ సోషల్ మీడియాలో ఈ ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రగ్యా అందమైన ఫోటోను చూస్తూ ఉంటే చూపు తిప్పుకోలేక పోతున్నామని అంటున్నారు. చీర కట్టులో గతంలో నడుము, నాభి అందం చూపిస్తూ తెగ కవ్వించి, కన్నుల విందు చేసిన ముద్దుగుమ్మ ప్రగ్యా మరోసారి ఎల్లో చీర కట్టు ఫోటోలతో మెప్పించింది. ప్రగ్యా చీర కట్టులో చాలా అందంగా ఉంటుంది, ఈ సారి అంతకు మించి అన్నట్టు ఆమె అందం ఉంది అంటూ ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న ముద్దుగుమ్మకు యంగ్ హీరోల నుంచి ఆఫర్లు రాకపోవడం విడ్డూరంగా ఉందని కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు బాలీవుడ్‌లో అయినా ఈమెను ఫిల్మ్ మేకర్స్ పరిగణలోకి తీసుకుని వరుసగా సినిమాలు చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణతో గతంలో ఈమె నటించిన అఖండ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు మరోసారి ఆయనతో కలిసి బాబీ దర్శకత్వంలో డాకు మహారాజ్ సినిమాను చేసింది. ఆ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా త్వరలోనే ప్రగ్యా మీడియా ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక అఖండ 2 లోనూ ఈమె హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.



# పింక్ బికినీలో అందాల సికిందర్

హిందీ టీవీ సీరియల్స్‌తో నార్త్ ఇండియాలో మంచి గుర్తింపు సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ షామా సికిందర్. ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అవుతున్నా అదే అందంతో నెటిజన్స్‌ను కవ్విస్తూనే ఉంది. బాబోయ్ ఇంత అందం ఎలా సాధ్యం అన్నట్లు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూనే ఉన్నాయి. మూడు మిలియన్‌లకు పైగా ఫాలోవర్స్ కలిగి ఉన్న ఈమె లేటు వయసులో అందాల ఆరబోత చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. యే మేరి లైఫ్ హై టీవీ సీరియల్ ద్వారా మంచి గుర్తింపు దక్కించుకోవడం ద్వారా హిందీ ప్రేక్షకులకు చేరువ అయ్యింది. సినిమాల్లో నటించిన పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేక పోయింది. అందుకే ఈమె సీరియల్స్‌కి ప్రాముఖ్యత ఇస్తూ వచ్చింది. బుల్లి తెరపై ఈమెకి మంచి డిమాండ్ క్రియేట్ అయ్యింది. బుల్లితెరపై ఈమెను చూసి అభిమానించే వారు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న ఫోటోలకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేయడం స్టార్ హీరోయిన్స్ కి సాధ్యమా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తున్న షామా సికిందర్ మరోసారి పింక్ బికినీ ఫోటోలను షేర్ చేసి కుర్రకారు గుండెల్లో గుబులు మొదలు పెట్టింది. ఇంత అందంగా ఉన్నా ఎందుకు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా వరుస ఆఫర్లు రాలేదు అంటూ కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ హీరోయిన్‌ల రేంజ్‌లో అందాలను చూపిస్తున్న షామా సికిందర్‌కి సీనియర్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు అయినా వస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. 1998లోనే ఫిరోజ్ ఖాన్ దర్శకత్వం వహించిన ప్రేమ్ ఆగ్గన్ తో సినిమా ఇండస్ట్రీలో షామా సికిందర్ ఎంట్రీ ఇచ్చింది. 16 ఏళ్ల వయసులోనే సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడికి లక్ కలిసి రాలేదు. అందుకే సినిమా ఇండస్ట్రీలో కాకుండా బుల్లి తెరపై ఈమె తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడ లక్ కలిసి రావడంతో ఇన్నాళ్లు ఇంకా ఇండస్ట్రీలో కొనసాగుతోంది. సెకండ్ ఇన్నింగ్స్ తో అయినా సినిమాల్లో ఆఫర్లు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. చాలా మందికి ఆలస్యంగా అవకాశాలు వస్తాయి.. కనుక షామా సికిందర్‌కీ ఇకపై హీరోయిన్ ఆఫర్లు రావాలని ఈ ఫోటోలను చూస్తూ ఉంటే అనిపిస్తుందని కొందరు కామెంట్ చేస్తున్నారు.





Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296